www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 12-6-2024


Rajamahendravaram | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రాజమహేంద్రవరం సిటీ

జిల్లాలో 29 డిజిటల్ స్క్రీన్లపై ప్రత్యక్ష ప్రసారం

రాజమహేంద్రవరం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభు త్వ ప్రమాణస్వీకారోత్సవాన్ని ప్రజలంతా కళ్లారా చూడాలని ఆశపడుతున్నారు. ఇప్పటికే లక్షలాది మంది తరలివెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. వెళ్లలేని ప్రజలు పెద్దతెరలమీద ప్రత్యక్షంగా చూసేలా చేయడానికి కలెక్టర్ మాధవీలత జిల్లాలో 29 చోట్ల డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటు చేయించారు. రాజమహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆనం కళాకేంద్రం, సుబ్రహ్మణ్య మైదానం, ఏవీఏ రోడ్డులోని రామాలయం సెంటర్, పుష్కరఘాట్, ఎంఎస్ఆర్ హైటెక్ బస్టాండ్, ఆల్‌కట్‌గార్డెన్స్‌లోని మునిసిపల్ కల్యాణమండపం, స్టేడియం, క్వారీ పేట సెంటర్, రైతు తాతాలు కల్యాణ మండపంలో స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. అనపర్తిలోని కళావేదిక, బిక్కవోలు కాపుల కల్యాణ మండపం,రంగంపేట మండలం వడిశలేరులోని కాకతీయ కమ్మ కల్యాణ మండపం, దేవరపల్లిలోని ఆర్య వైశ్య కల్యాణ మండపం, గోపాలపురంలోని ఆర్య వైశ్యకల్యాణ మండపం, నల్లజర్లలోని ఎంపీడీవో ఆఫీసు, గోకవరం మండలం కొత్తపల్లిలోని ఆదర్శ పార్మసీ కాలేజి, కొవ్వూరు అర్బన్ యువరాజు ఫంక్షన్ హాల్,కొవ్వూరు రూరల్‌లో ఎంపీడీవో ఆఫీసు,తాళ్లపూడి పం చాయతీ, చాగల్లులోని సుబ్రహ్మణ్యే శ్వర ఆడిటోరియం, నిడదవోలు రూరల్ సమిశ్రగూడెం గీతా మందిరం, నిడదవోలు అర్బన్ రోటరీ ఫంక్షన్‌హాల్, ఉండ్రాజ వరంలో శివా లయం సెంటర్,పెరవలి ఎంపీడీవో ఆఫీసులో స్క్రీన్స్ ఏర్పాటుచేశారు.

నేడు మహా పండుగ



ఇదే విక్టరీ : టీడీపీ అధినేత చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్

(కాకినాడ/రాజమహేంద్రవరం/అమలాపురం-ఆంధ్రజ్యోతి)

సంబరం...మహా సంబరం.. ఓటుతో ప్రజాస్వామ్యాన్ని గెలి పించి ప్రజాప్రభుత్వం ఏర్పాటుకు పాటుపడ్డ ప్రతి ఒక్కరి పం డగ నేడు. చరిత్రను తిరగరాస్తూ, రికార్డుల మోత మోగిస్తూ, ప్రజాకంటక పాలనను ఊచకోత కోసి సరికొత్త నవశకానికి నాంది పలికిన ప్రజల ఆకాంక్షలు ప్రతిఫలిస్తోన్న క్షణాలు నేడు. చరిత్రను తిరగరాస్తూ ఇచ్చిన సునామీ తీర్పుతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి ఏకంగా 22 మంది ఎమ్మెల్యేలు టీవీగా నిల బడుతోన్న గడియలివి.ఈరోజు ఉదయం చంద్ర బాబు 11.27 గంటలకు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పండగ వాతా వరణం నెలకొంది. ప్రమాణ స్వీకారాన్ని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజలు వీక్షించేలా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కాకినాడ జిల్లా పరిధిలో 19 ఏర్పాటు చేయగా, కాకినాడ కార్పొరేషన్ పరిధిలో 9 చోట్ల ఏర్పాటు చేశారు. తూర్పుగోదావరి జిల్లా పరిధిలో 29 , కోనసీమ జిల్లాలో 20 స్క్రీన్లు సిద్ధం చేశారు.ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కలెక్టరేట్లు, ఇతర ప్రభుత్వ కార్యాల యాలు విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు.సీఎంగా చంద్ర బాబుతో పాటు పిఠాపురం ఎమ్మెల్యేగా తొలి సారిగా విజయం సాధించిన పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎంగా ప్రమాణస్వీకారం చేయనున్నారు.ఉమ్మడి జిల్లాకు ఇంకో రెండు వరకు దక్కనున్న బెర్త్‌ల కోసం సీనియర్లు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తు న్నారు. వీరితో పాటు ఈ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా నుంచి ఏకంగా 12 మంది తొలిసారిగా ఎమ్మెల్యేలుగా గెలిచారు.వీళ్లు సైతం అమాత్య పదవికి ప్రయత్నాలు చేస్తున్నారు. 17న అసెంబ్లీలో వీరంతా ప్రమాణస్వీకారం చేయనున్నారు.

- సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం
- ఉమ్మడి జిల్లాలో కూటమి ప్రభంజనం
- 22 మంది ఎమ్మెల్యేలు హాజరు
- జిల్లా నుంచి ఏకపక్ష మద్దతు
- ఎన్నికల చరిత్రలో కొత్త రికార్డులు
- డిప్యూటీ సీఎంగా పవన్ కల్యాణ్
- జిల్లాకు మరో రెండు మంత్రి పదవులు?
- కేబినేట్‌లో బెర్త్‌కు తీవ్ర ప్రయత్నాలు
- నాయకులంతా అమరావతిలోనే మకాం
- 12 మంది తొలిసారిగా ఎమ్మెల్యేలు
- ఈ నెల 17న అసెంబ్లీలో ప్రమాణం

డిప్యూటీ సీఎంగా పవన్..



నేడు ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం నేపథ్యంలో కేబినేట్‌లో ఎవరెవరికి ఛాన్స్ ఉం టుందనే చర్చ ఉత్కంఠగా మారింది. ప్రధానంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు రెండు నుంచి మూడు మంత్రి పదవులు దక్కనున్నాయి. 2014లో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఉమ్మడి జిల్లా నుంచి యనమల,రాజప్పలకు మంత్రి పదవులు లభించాయి.ఈ సారి మంత్రి పదవులు రెండు లేదంటే మూడు వరకు కేటాయించవచ్చనే చర్చ సాగుతోంది. జనసేన నుంచి ఆరుగురు ఎమ్మెల్యేలు ఉండగా ఒకరిద్దరికి ప్రాతినిధ్యం కల్పించాల్సి ఉంది. పిఠాపురం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన పవన్ కల్యాణ్‌కు కేబినెట్‌లో డిప్యూటీ సీఎం పదవి ఖాయమైంది. బుధవారం చంద్రబాబు ప్రమాణ స్వీకారం అనంతరం పవన్ డిప్యూటీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. పవన్‌ను మినహాయిస్తే ఉమ్మడి జిల్లాకు మంత్రి పదవులు ఎన్ని ఇస్తారనేది సస్పెన్స్‌గా మారింది. మంత్రివర్గంలో చోటు కోసం కాకినాడ జిల్లా నుంచి యనమల, రాజప్ప, జ్యోతుల నెహ్రూ రేసులో ఉన్నారు.రాజమహేంద్రవరం జిల్లా నుంచి సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, జనసేన నుంచి నిడదవోలు ఎమ్మెల్యే కందుల దుర్గేష్,కోనసీమ జిల్లా నుంచి ముమ్మిడివరం,అమలాపురం ఎమ్మెల్యేలు దాట్ల సుబ్బరాజు,అయితాబత్తుల ఆనందరావు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు.సీనియర్ ఎమ్మెల్యేలు బుచ్చయ్య చౌదరి,జ్యోతుల నెహ్రూ పేర్లు బాగా వినిపి స్తున్నాయి. జనసేనకు పవన్‌తో పాటు మరొక మంత్రి పదవి ఇవ్వాలనే డిమాండ్ ఉన్న నేపథ్యంలో కందుల దుర్గేష్ పేరు వినిపిస్తోంది. పవన్‌తో పాటు ఉమ్మడి జిల్లాలో అమాత్య పదవి ఎవరిని వరించనుందో చూడాలి.

బలమంతా 'తూర్పు'దే...

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఓట్ల వరద పొంగింది. అధికార వైసీపీని నిండా ముంచేసింది. తిరిగి పైకి లేవలేనంతంగా భూస్థాపితం చేసింది. కూటమికి అనన్య సామాన్యమైన విజయాన్ని అందించింది. ఫలితంగా ఎన్నికల చరిత్రలో మునుపెన్నడూ కనివినీ ఎరుగని రీతిలో ఏకంగా 22 మంది ఎమ్మెల్యేలు టీడీపీ, జనసేన,బీజేపీ నుంచి విజయం సాధించారు. ఇంత వరకు ఏ పార్టీకి ఉమ్మడి జిల్లాలో రానన్ని సీట్లు, చూడనంత వేలాది ఓట్ల మెజార్టీలతో ఓట్లాభిషేకం చేశారు. రాష్ట్రంలో అత్యధిక మెజార్టీల జాబితాలో జిల్లా నుంచి అనేక మంది ఎమ్మెల్యేలు స్థానం దక్కించుకున్నారు. వాస్తవానికి అసెంబ్లీ ఎన్నికల్లో అధికార వైసీపీ సీట్లను చాలా వరకు ముందే ప్రకటించింది. కానీ కూటమి తరపున టీడీపీ,జనసేన ఆచితూచి అభ్యర్థులను ఎంపిక చేశాయి.కూటమి తరపున నిలబడ్డ అభ్యర్థులందరిని అఖండ మెజార్టీతో గెలిపించారు. కాకినాడ, రాజమహేంద్రవరం,అమలాపురం మూడు పార్లమెంట్ల పరిధిలోని స్థానాలు, రంపచోడవరం అసెంబ్లీ సీటుతో కలిపి మొత్తం 22 స్థానాలను కూటమి కైవసం చేసుకుంది.ఇందులో టీడీపీ 15, జనసేన ఆరు, బీజేపీ ఒక సీటు దక్కించుకున్నాయి. ఒక్కటంటే ఒక్క సీటు కూడా వైసీపీకి దక్కకుండా ప్రజలు కసి తీరా ఓటమి రుచి చూపించారు. ఉమ్మడి జిల్లా నుంచి 22 చోట్ల విజయం సాధించిన కూటమి ఎమ్మెల్యేల్లో ఏకంగా 12 మంది తొలిసారి ఎమ్మెల్యేలుగా విజయం సాధించడం అనేక రికార్డులను తిరగరాసింది. ప్రధానంగా కాకినాడ పార్లమెంట్ పరిధిలో తుని నుంచి యనమల దివ్య (టీడీపీ), ప్రత్తిపాడు నుంచి వరుపుల సత్యప్రభ (టీడీపీ), పిఠాపురం నుంచి పవన్ కల్యాణ్(జనసేన), కాకినాడరూరల్ నుంచి పంతం నానాజీ(జనసేన) తొలి సారిగా ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. రాజమహేంద్రవరం పార్లమెంట్ పరిధిలో రాజమహేంద్రవరం సిటీ నుంచి ఆదిరెడ్డి శ్రీనివాసు(టీడీపీ),గోపాలపురం నుంచి మద్దిపాటి వెంకటరాజు(టీడీపీ), రాజానగరం నుంచి బత్తుల బలరామకృష్ణ(జనసేన), నిడదవోలు నుంచి కందుల దుర్గేష్(జనసేన), అమలాపురం పార్లమెంట్ పరిధిలో రామచంద్రపురం నుంచి వాసంశెట్టి సుభాష్ (టీడీపీ), పి.గన్నవరం నుంచి గిడ్డి సత్యనారాయణ (జనసేన),రాజోలు దేవ వరప్రసాద్ (జనసేన), రంపచోడవరం శిరీష(టీడీపీ) విజయం సాధించారు. వీరంతా ఇప్పటికే అమరావతికి చేరుకున్నారు. మంగళవారం విజయవాడలో జరిగిన టీడీఎల్పీ సమావేశంలో శాసనసభాపక్ష నేతగా చంద్రబాబును ఎన్నుకున్నారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారంలో కొత్తగా నెగ్గిన ఎమ్మెల్యేలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు.వీరంతా ఈనెల 17 అసెంబ్లీలో ఎమ్మెల్యేలుగా ప్రమాణస్వీకారం చేయనున్నారు.ఉమ్మడి తూ ర్పుగోదావరి జిల్లా నుంచి ఇంత మంది అసెంబ్లీకి తొలి సారి ఎమ్మెల్యేలుగా వెళ్లడం భారీ రికార్డు అనే చెప్పాలి.


దాట్ల సుబ్బరాజు, ముప్పిడి వెంకటేశ్వరరావు,అయితాబత్తుల ఆనందరావు, బండారు సత్యానందరావు, వాసంశెట్టి సుభాష్



దేవ వరప్రసాద్, గిడ్డి సత్యనారాయణ, పంతం నానాజీ, గోరంట్ల బుచ్చయ్యచౌదరి



యనమల దివ్య, వరుపుల సత్యప్రభ, మిరియాల శిరీషాదేవి, ఆదిరెడ్డి శ్రీనివాసు


లోకేశ్‌ను అభినందిస్తున్న పురందేశ్వరి


వేగుళ్ల జోగేశ్వరరావు, ఎం.వెంకటరాజు


దుర్గేష్

కూటమి సంబరం

ఎన్‌డీఏ కూటమి సమావేశం మంగళవారం విజయవాడలో నిర్వహించారు.. ఉమ్మడి జిల్లా నుంచి ఎన్నికైన 22 మంది ఎమ్మెల్యేలు హాజర య్యారు..వీరిలో 12 మంది కొత్తవారు కాగా ముగ్గురు మహిళలు. ఎమ్మెల్యేలు ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్, పురందేశ్వరికి అభినందనలు తెలిపారు.


కార్యాలయాలకు కళొచ్చింది..


కాంతులీనుతున్న కలెక్టరేట్



వెలిగిపోతున్న రాజమండ్రి కార్పొరేషన్ కార్యాలయం

కొత్త ప్రభుత్వ ప్రమాణ స్వీకారం నేపథ్యంలో జిల్లాలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు విద్యుత్ కాంతులతో ధగధగ మెరిసి పోతున్నాయి. జిల్లా కలెక్టరేట్, కలెక్టరేట్ క్యాంపు కార్యాలయం, ఆర్ట్స్ కాలేజీ, మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం , దివాన్ చెరువులోని ఆదికవి నన్నయ వర్సిటీ ప్రాంగణం కాంతులీనుతూ హైవే ప్రయాణి కులకు కనులవిందు చేస్తోంది. కొవ్వూరు సబ్- కలెక్టర్ కార్యా లయానికి విద్యుత్ అలంకరణ చేశారు.


మెరిసిపోతున్న మొక్కలు

పలుచోట్ల విడిది


చంద్రబాబు ప్రభుత్వ ప్రమాణస్వీకారాన్ని ప్రత్యక్షంగా చూడడానికి ఉత్తరాంధ్ర నుంచి వెళ్లే ప్రజలు మధ్యలో కాస్త విశ్రాంతి తీసుకుని, రిఫ్రెష్ కావడానికి జిల్లాలో పలు చోట్ల విడిది ఏర్పాటు చేశారు. దివాన్‌చెరువులోని ఎస్‌పీపీసీ కన్వెన్షన్, కాతేరు వెంకటాద్రి, దేవరపల్లిలోని డైమండ్ సెంటర్, నల్లజర్లలోని జేఎస్‌వీఆర్ కల్యాణ మండపంలోనూ సౌకర్యాలు ఏర్పాటు చేశారు. రాత్రంతా ప్రయాణించి తెల్లారేసరికి అక్కడకు చేరుకునే వారికి స్నానపానాదుల సౌకర్యం, బ్రేక్‌ఫాస్ట్ ఏర్పాటు చేశారు.

చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి 100కుపైగా ఎక్స్‌ప్రెస్ బస్సులు

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 11 : రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బుధవారం ప్రమాణస్వీకారం చేయనున్నారు.ఈ కార్యక్రమానికి హాజరయ్యే జిల్లా ప్రజలు, పార్టీ అభిమానుల కోసం జిల్లా ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులు నడుపుతోంది. ఈ మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి 100కు పైగా ఆర్టీసీ బస్సులు బుధవారం విజయవాడ బయలుదేరి వెళుతున్నాయి. తూర్పుగోదావరి జిల్లా నుంచి 32 బస్సులు కేటాయించగా, డాక్టర్ అంబేద్కర్ కోన సీమ జిల్లా నుంచి 35, కాకినాడ జిల్లా నుంచి సుమారు 35 వరకూ ఎక్స్‌ప్రెస్ బస్సులు కేటాయించినట్టు సమాచారం.సాధారణ ప్రయాణీకులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కేవలం ఎక్స్‌ప్రెస్ సర్వీసులను మాత్రమే కేటాయించడం గమనార్హం.

ఎంసెట్‌లో 'ఉమ్మడి తూర్పు'నకు ర్యాంకుల పంట

- ఇంజనీరింగ్ విభాగంలో బిక్కవోలు విద్యార్థికి 25వ ర్యాంకు, ఏలేశ్వరం విద్యార్థికి 40వ ర్యాంకు, నిడదవోలు విద్యార్థికి 56వ ర్యాంకు
- అగ్రికల్చరల్ విభాగంలో తొండంగికి చెందిన 49వ ర్యాంకు, కడియం విద్యార్థికి 54వ ర్యాంకు, సఖినేటిపల్లి విద్యార్థికి 59వ ర్యాంకు


బి.రఘురామసహాస్ (25వ ర్యాంకు) | పీవీఎస్‌డీ సాయిమోహిత్ (40వ ర్యాంకు) | గజ్జరపు సత్యనారాయణ (56వర్యాంకు) | దేశిన సూర్యచరణ్ (49వ ర్యాంకు) | గ్రంధి సాయిమనోజ్ (54వ ర్యాంకు) | కొప్పినీడి ఫణికుమార్ (59వ ర్యాంకు)

రాజమహేంద్రవరం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎంసెట్‌లో ఉమ్మడి తూర్పుగోదావరికి ర్యాంకుల పంట పండింది. ఇంజనీరింగ్ విభాగంలో కాకినాడ జిల్లాకు సంబంధించి సామర్లకోటకు చెందిన మారిశెట్టి సాయిచరణ్ 22వ ర్యాంకు, కాకినాడ రూరల్‌కు చెందిన గొలపల్లి ఫణీంద్ర 47వ ర్యాంకు, కాకినాడ రూరల్‌కు చెందిన బిక్కిన రోహిత్ చౌదరి 57వర్యాంకు సాధించారు. తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి బిక్కవోలుకు చెందిన భీమిరెడ్డి రఘు రామసహాస్ 25వ ర్యాంకు, ఏలేశ్వరానికి చెందిన ప్రగల్లపాటి వీఎస్‌డీ సాయి మోహిత్ 40వ ర్యాంకు, నిడదవోలుకు చెందిన గజ్జరపు సత్యనారాయణ 56వర్యాంకు సాధించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు సంబంధించి కొత్తపేటకు చెందిన బి.సాయినరేన్ 51వ ర్యాంకు, అమలాపురానికి చెందిన బొజనాపల్లి కల్కి సువరణ్ 100వ ర్యాంకు, అమలాపురానికి చెందిన మెట్ల గౌతమ్ వెంకట మహేష్ 105వర్యాంకు సాధించారు. అగ్రికల్చరల్ విభాగంలో కాకినాడ జిల్లాలో శ్రీనగర్‌కు చెందిన దామిశెట్టి సిద్దార్థ 11వ ర్యాంకు, పిఠాపురానికి చెందిన నిమ్మకాయల శర్వణసత్యరవికిరణ్ 13వర్యాంకు, కాకినాడ వెంకటేశ్వరనగర్‌కు చెందిన యండమూరి నమిత రాణి 31వ ర్యాంకు సాధించారు. తూర్పుగోదావరి జిల్లాలో తొండంగికి చెందిన దేశిన సూర్యచరణ్ 49వర్యాంకు, కడియానికి చెందిన గ్రంధి సాయిమనోజ్ 54వ ర్యాంకు, సఖినేటిపల్లికి చెందిన కొప్పినీడి ఫణికుమార్ 59వ ర్యాంకు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ముమ్మిడివరానికి చెందిన దేశంశెట్టి ప్రభాస్ 41వర్యాంకు, మలికిపురానికి చెందిన పెచ్చెట్టి లిఖిత 65వ ర్యాంకు, రాజోలుకు చెందిన సోడదాసు రేష్మిత 92వ ర్యాంకు సాధించారు.



పసుపు సంబరం

విజయవాడ మంగళగిరిలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను కలిసి అభినందనలు తెలుపుతున్న రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణుడు, తదితరులు

రాష్ట్రంలో ఐదేళ్ల అరాచక పాలన

వైసీపీ పాలనలో ఎదురు ప్రశ్నించడమే నేరమైంది. తమకు న్యాయం చేయండి అని అడగడమే నేరమన్నట్లుగా అనేక మందిని ప్రభుత్వం పొట్టనబెట్టుకుంది. ఇలాగే తూర్పుగోదావరిజిల్లా అనపర్తి నియోజకవర్గంలో వైసీపీ వేధింపులు తాళలేక ముగ్గురు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని భావించిన టీడీపీ అధినేత చంద్రబాబు నేడు నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేస్తున్న తరుణంలో రాష్ట్రంలోని 104 వైసీపీ బాధిత కుటుంబాలకు ప్రత్యేక ఆహ్వానం పంపించారు. అనపర్తి నియోజకవర్గంలో ఈ మూడు బాధిత కుటుంబాలకు ప్రత్యేక ఆహ్వానం పంపడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. ఆయా కుటుంబాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

- వైసీపీ పాలనకు అనపర్తిలో ముగ్గురు బలి
- వేధింపులు, అక్రమ కేసులకు బలైన మరెన్నో కుటుంబాలు
- బాధితులను అక్కున చేర్చుకునే నిర్ణయంపై హర్షం

రోడ్డు వేస్తానని మోసం చేశారు



అనపర్తిలో ఆత్మహత్యకు పాల్పడిన అరుణకుమారి తమ కుటుంబ సభ్యులతో (ఫైల్)

అనపర్తి, జూన్ 11: 2019 సార్వత్రిక ఎన్నికల్లో అనపర్తి ఎమ్మెల్యేగా డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఎన్నికయ్యారు. అనపర్తిలోని బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో వేసిన లేఅవుట్‌లో అనేకమంది ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసుకుని ఇళ్లు నిర్మించుకుని ఆంజనేయరెడ్డి నగర్‌గా నామకరణం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ కాలనీలోనే దివంగత మాజీ ఎమ్మెల్సీ జార్జి విక్టర్ కూడా నివాసం ఉండేవారు. పాఠశాలకు చేర్చి క్రీడా స్థలం ఉండేది. దీనికి ఎటువంటి ప్రహరీగోడ లేకపోవడంతో ఈ కాలనీవాసులంతా క్రీడామైదానం నుంచి నివాసాలకు వెళ్లేందుకు 20అడుగుల తాత్కాలిక రోడ్డును నిర్మించుకున్నారు. అదే సమయంలో హైస్కూల్‌కు ప్రహరీ నిర్మాణం చేయాలని సంకల్పించడం, స్థానిక సంస్థల ఎన్నికలు రావడం ఒకేసారి జరిగాయి. ప్రహరీ నిర్మాణం చేపడితే రోడ్డును మూసివేస్తారని కాలనీవాసులు ఆందోళన చెంది ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డిని ఆశ్రయించడంతో ఆయన ప్రహరీ నిర్మాణంలో ఇబ్బందులు కలుగకుండా కాలనీకి రోడ్డు ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారంతా ఆనందం వ్యక్తం చేశారు. తీరా నిర్మాణ సమయానికి భారీ పోలీసు బందోబస్తుతో రోడ్డు వదలకుండా ప్రహరీ నిర్మాణం పూర్తి చేశారు. దీంతో కాలనీవాసులు బయటకు వచ్చేందుకు శ్మశాన మార్గం గుండా ప్రయాణించాల్సి వచ్చింది. దీంతో కాలనీలో నివసిస్తున్న కర్రి అరుణకుమారి తమను ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి మోసం చేశారని, రోజూ తెల్లవారుజామున గుడికి వెళ్లే భాగ్యం లేకపోతుందని, తన చావుకు ఎమ్మెల్యే కారకుడని సూసైడ్ నోట్ రాసి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఇంత జరిగినా పోలీసు యంత్రాంగం అధికారానికి కొమ్ముకాసి కేసును నీరుగార్చే ప్రయత్నం చేశారు

న్యాయ పోరాటం చేస్తున్నాను

- మృతురాలి భర్త సూర్యనారాయణరెడ్డి

ఇచ్చిన మాట తప్పిన ఎమ్మెల్యే వల్లే నా భార్య ఆత్మహత్యకు పాల్పడింది. కేసును నీరు గార్చేందుకు పోలీసులు అనేక ప్రయత్నాలు చేశారు. అధికార పార్టీకి భయపడి కేసుకు సంబంధించిన పత్రాలు కూడా ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేశారు. నా భార్య మృతిపట్ల న్యాయం జరిగే వరకు న్యాయ పోరాటం చేస్తాను.

ప్రైవేట్ లే అవుట్‌కు పూరి గుడిసె అడ్డం వచ్చిందని..



బిక్కవోలు: ఆర్ఎస్ పేటలో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడిన కామాక్షమ్మ (ఫైల్)

బిక్కవోలు మండలం ఆర్ఎస్ పేట శివారు బలభద్రపురం గ్రామానికి చెందిన ప్రభుత్వ స్థలంలో ఆర్ఎస్‌పేటకు చెందిన కోటిపల్లి కామాక్షి ఎన్నో ఏళ్లుగా నివాసం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తోంది. ఈ గుడిసె పక్కనే ప్రైవేట్ లేఅవుట్ వెలిసింది. లేఅవుట్‌కు వెళ్లే దారికి కామాక్షమ్మ గుడిసె అడ్డం రావడంతో వైసీపీ నాయకుల అండతో అధికారులు ఇంటి నిర్మాణానికి రుణం మంజూరు చేస్తామని నమ్మబలికి వారితోనే పాత ఇంటిని తొలగించారు. మరుసటి రోజునే ఇది ప్రభుత్వ స్థలమని ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంతో ఆ కుటుంబం కంగుతిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌లో కూడా ఫిర్యాదు చేశారు. అధికార పార్టీ ముందు వీరి పేదరికం నిలవలేకపోయింది. దీంతో జీవితంపై విరక్తి చెందిన కామా క్షమ్మ, ఆమె కుమారుడు మురళీకృష్ణ తమకు జరిగిన అన్యాయాన్ని, కారకులనూ వివరిస్తూ సెల్ఫీ వీడియోలో మాట్లాడుతూ పురుగుల మందు తాగారు. దీంతో స్థానికులు వీరిని ఆసుపత్రికి తరలించగా కుమారుడు ప్రాణాపాయం నుంచి బయట పడగా కామాక్షమ్మ చికిత్స పొందుతూ కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో మృతి చెందింది. దీంతో టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆమె కుటుంబానికి న్యాయం చేయాలంటూ ఆందోళన నిర్వహించారు. చివరకు పోలీసులు మృతదేహాన్ని ఇంటికి చేరకుండా శ్మశానికి తరలించాల్సిందేనని అంబులెన్స్‌ను కూడా కాకినాడలో రోడ్డు పక్కన నిలిపివేయడం బాధిత కుటుంబానికి వేదన మిగిల్చింది. నేటికీ ఆ కుటుంబా నికి న్యాయం జరగలేదు.

టీడీపీ సానుభూతి పరుడిగా ఉండడంతో పంపన ప్రాణాలు తీశారు



ఆత్మహత్యకు పాల్పడిన పంపన ఆనందరావు (ఫైల్)

అనపర్తి మండలం పులగుర్త గ్రామానికి చెందిన పంపన ఆనందరావు కూలీనాలీ చేసుకుని జీవనంసాగించేవాడు. గ్రామంలో ఆనందరావు టీడీపీ సానుభూతిపరుడిగా ఉండడం, వైసీపీ చేస్తున్న అరాచకాలపై గొంతెత్తడంతో వైసీపీ నేతలకు కోపం వచ్చింది. పంపనను కట్టడి చేసేందుకు అక్రమ కేసు పెట్టాలని ప్రయత్నం చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పోలీసులతో మాట్లాడి అతడిని బయటకు తీసుకువచ్చారు. వెంటనే తిరిగి స్టేషన్‌కు రావాలని పోలీసులు ఫోన్ చేయడంతో భయానికి గురైన ఆనందరా వు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. వారం రోజులు మృత్యువుతో పోరాడి ప్రాణాలు విడిచాడు. ఆనందరావు మరణంతో ఆయన భార్య పిల్లలు, తల్లి అనాథలుగా మిగిలిపోయారు. ఆ కుటుంబానికి టీడీపీ తరపున నాయకులు, కార్యకర్త లు కొంత మొత్తాన్ని నల్లమిల్లి చేతులమీదుగా అందించి ఆదుకున్నారు.

పీజీ డిప్లమో ఇన్ యోగా కోర్సులో ప్రవేశాలకు గడువు పెంపు

- నన్నయ వీసీ పద్మరాజు

దివాన్‌చెరువు, జూన్ 11: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ద్వారా కానవరంలోని శ్రీరాపర్తిరామ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగాతో పీజీ డిప్లమో ఇన్ యోగా కోర్సులో ప్రవేశాల దరఖాస్తులకు ఈనెల 30వ తేదీ వరకూ గడువు పొడిగించినట్టు ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు మంగళవారం తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి పీజీ డిప్లమో ఇన్ యోగా కోర్సులో ఒక ఏడాది పార్ట్‌టైమ్ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. దీనికి సంబంధించి గడువును 30వ తేదీ వరకూ పొడిగించామని తెలిపారు. ఆలస్య రుసుముతో జూలై 8వ తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరిస్తారని చెప్పారు. నన్నయ విశ్వవిద్యాలయం దివాన్‌చెరువు క్యాంపస్, కానవరంలోని శ్రీరాపర్తిరామ సంస్థలో 50సీట్లు చొప్పున కోర్సును అం దిస్తున్నామన్నారు. ఏదైనా డిగ్రీ పూర్తిచేసిన వారు ఈ కోర్సులో చేరేందుకు అర్హులని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు పొడిగించిన తేదీల్లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

'సుప్రీం'లో లోక్ అదాలత్

- పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): జూలై 29 నుంచి ఆగస్టు 3వరకూ సుప్రీం కోర్టులో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారని ఉమ్మడి తూర్పు గోదావరిజిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొ న్నారు. సుప్రీంకోర్టులోని పెండింగ్‌లో ఉన్న రాజీకి అర్హమైన అన్ని కేసులనూ ఆ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు. ఈవిషయంపై కక్షిదారులకు సమీప కోర్టు ప్రాంగణంలో ఉండే న్యాయ సేవాధికార సంస్థలు అవసరమైన సహాయాన్ని అందిస్తున్నాయన్నారు. కక్షిదారులు, న్యాయవాదులు టోల్ ఫ్రీ నెంబరు 15100 లో కూడా సంప్రదించవచ్చని పేర్కొన్నారు. సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసం ఈ ప్రత్యేక లోక్ అదాలత్‌కి న్యాయవాదులు పంపించ వచ్చని తెలిపారు.

సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



ఏపీఆర్వో గణపతిరావుకు విరాళం అందజేస్తున్న దాత నర్రా శ్రీలక్ష్మి

అన్నవరం, జూన్ 11: సత్యదేవుడి సన్నిధిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి మంగళవారం హైదరాబాద్‌కు చెందిన నర్రా శ్రీలక్ష్మి రూ.1,01,116 విరాళంగా దేవస్థానం ఏపీఆర్వో ఎం.గణపతిరావుకు అందజేశారు. ఈసందర్భంగా దాతను ఆయన అభినందించి వారికి స్వామివారి ప్రసాదాలు, ప్రత్యేకదర్శనం కల్పించారు.

ప్రముఖ రైసు మిల్లర్ పాండురంగారెడ్డి మృతి



చింతా పాండురంగారెడ్డి (ఫైల్)

బిక్కవోలు, జూన్ 11: బిక్కవోలు మండలం కొమరిపాలెంనకు చెందిన మురళీమోహన బాయిల్డ్ అండ్ రా రైసు మిల్లు అధినేత చింతా పాండురంగారెడ్డి(72) మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో ఆయన స్వగృహంలో మృతి చెందారు. రంగారెడ్డి 1983లో గ్రామంలో చిన్న రైసుమిల్లును ప్రారంభించి వ్యాపారంలో అంచెలంచెలుగా ఎదిగారు. ఈయన మిల్లుల్లో తయారైన బియ్యం 14 దేశాలకు సరఫరా చేస్తున్నారు. రంగారెడ్డి రైసుమిల్లు రంగంలో చేస్తున్న కృషిని గుర్తించి మరిన్ని ఉత్పత్తులు సాధించడానికి 1997లో ఏడు దేశాల పర్యటనకు ప్రభుత్వం పంపింది. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి ఉత్తమ రాష్ట్ర రైసుమిల్లరు అవార్డు, జిల్లాలో పలుమార్లు జిల్లా ఉత్తమ రైసుమిల్లరు అవార్డులు పొందారు. ఆయన మృతి పట్ల కేపీఆర్ సంస్థల ఎండీ ముకుందరెడ్డి, ఈడీ రాజశేఖరరెడ్డి, డైరెక్టర్లు సత్తిబాబు సోదరులు, నల్లమిల్లి మహలక్ష్మి, నల్లమిల్లి మనోజ్, పడాల రాము, ప్రముఖ వైద్యులు నవీన్, సూరారెడ్డి, జీఎస్ఎన్. రెడ్డి, మురళీమోహన గ్రూపు ఉద్యోగుల నేతలు వీర్రాఘవరెడ్డి, అమ్మిరెడ్డి, రామచంద్రారెడ్డి ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

వైసీపీ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

- అడ్డుకుని కౌన్సిలింగ్ ఇచ్చిన పోలీసులు



గామన్‌బ్రిడ్జిపై ఆత్మహత్యకు పాల్పడిన రాజుకు కౌన్సిలింగ్ ఇస్తున్న పోలీసులు

కొవ్వూరు, జూన్ 11: చాగల్లు మండలం బ్రాహ్మణగూడెం గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త రాజు కొవ్వూరు గామన్‌బ్రిడ్జి పైనుంచి భార్యాబిడ్డలతో గోదావరిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ మంగళవారం సోషల్ మీడియాలో ఓ వీడియో హల్‌చల్ చేసింది. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులు ఓడిపోవడంతో మనస్తాపం చెందాడు. వైసీపీ ఓడిపోవడంలో ఈవీఎం టాంపరింగ్ ఉందని, ఈ విషయంపై జగన్మోహనరెడ్డి, రాష్ట్రపతి ద్రౌపదిముర్ముకు సమాచారం అందజేయాలని, ఇప్పటికిప్పుడు ఈవీఎంల ద్వారా కాకుండా బ్యాలెట్ ద్వారా ఎన్నికలు జరపాలని డిమా ండ్ చేస్తున్నట్టు ఆ వీడియోలో ఉంది. సమాచారం తెలుసుకున్న సీఐ వి.జగదీశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని రాజు కుటుంబాన్ని అదుపులోకి తీసుకుని కౌన్సిలింగ్ ఇచ్చారు.

కాలువలో పడి విద్యార్థి మృతి

- ఫ్రీజర్ పనిచేయకపోవడంతో ఆందోళన



మృతిచెందిన గుబ్బల దుర్గాప్రసాద్

యానాం, జూన్ 11: యానాం శివారు గిరియాంపేటలోని కాలువలో స్నానానికి దిగి అపస్మారకస్థితిలో విద్యార్థి మృతి చెందిన సంఘటన యానాంలో చోటు చేసుకుంది. గిరియాంపేటకు చెందిన గుబ్బల దుర్గాప్రసాద్(14)ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. పాఠశాల వెనుక ఉన్న కాలువలో ఆడుకునేందు వెళ్లి అపస్మారక స్థితిలో కాలువ ఒడ్డున పడిఉండటంతో గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు పడవపై తీసుకువచ్చారు. అనంతరం యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. అక్కడ ఫ్రీజర్ పనిచేయకపోవడంతో ఆసుపత్రి అధికారులపై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో మృతుల బంధువులు, యువత ఆసుపత్రి ముందు ఆందోళకు దిగారు. ఆసుపత్రిలో మార్చురీ పనిచేయకపోవడం అధికారుల పనితీరును వివరిస్తుందని అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమా ండ్ చేశారు. పోలీసులు, ఆసుపత్రి ఉన్నతాధికారులు ఆందోళనకారులతో చర్చించారు. నెలరోజుల్లో బాగుచేయించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వంతో ఆందోళన విరమించారు. ఇప్పటివరకు యానాం వృద్ధాశ్రమం నుంచి తీసుకువచ్చిన ఫ్రీజర్‌లో మృతదేహాలను భద్రపరిచారు. విద్యార్థి మృతిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



యానాంలోని మార్చురీలో ఫ్రీజర్ బాక్సులేదని ఆసుపత్రివద్ద ధర్నా చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

నగరం జీసీఎస్‌లో మానుపిల్లి హల్‌చల్

- బంధించిన ఓఎన్జీసీ సిబ్బంది

మామిడికుదురు, జూన్ 11: నగరం జీసీఎస్‌లో ఒక మానుపిల్లి హల్‌చల్ చేస్తూ జీసీఎస్‌లోని వైర్లను కొరికివేస్తూ హల్‌చల్ చేయడంతో సిబ్బంది హైరానా పడేవారు. అనుకోకుండా ఒక మానుపిల్లి పిల్ల ఒకటి సిబ్బందికి దొరకడంతో దానిని బోనులో బంధించి తల్లి పిల్లికి ఎర వేశారు. సోమవారంరాత్రి తల్లి పిల్లి కూడా బోనులో చిక్కుకోగా దాంతోపాటు పిల్ల పిల్లిని అటవీశాఖ అధికారులు ఓఎన్జీసీ అధికారులకు అప్పగించారు. గత మూడు నెలలుగా జీసీఎస్‌లో కేబుళ్లను పాడుచేస్తూ వివిధ రకాల శబ్దాలుచేస్తూ ఇబ్బంది పెడుతుందని ఓఎన్జీసీ రెసిడెంట్ ఇంజనీర్ రుషికేశ్‌రెడ్డి తెలియచేశారు. ఈ మానుపిల్లిని పామ్ సివిట్‌గా పిలుస్తారని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఆర్.వెంకటరమణ తెలిపారు. దీనిని అధికారుల సూచనల మేరకు నిర్మానుష్య ప్రదేశాల్లో విడిచిపెడతామని తెలిపారు.



నగరంలోని జీసీఎస్ వద్ద బోనులో బంధించిన మానుపిల్లి

విత్తన దుకాణాల్లో జిల్లా అధికారుల బృందం తనిఖీలు

- రూ.4.89లక్షలు విలువైన పత్తి విత్తనాల విక్రయాలు నిలిపివేత



గొల్లప్రోలులోని విత్తనాల దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న వ్యవసాయశాఖ జిల్లా అధికారుల బృందం

గొల్లప్రోలు, జూన్ 11: కాకినాడజిల్లా గొల్లప్రోలు పట్టణం, మండల పరిధిలోని గ్రామాల్లోని విత్తనాలు, ఎరు వులు, పురుగుల మందుల దుకాణాల్లో వ్యవసాయశాఖ జిల్లా అధికారుల బృందాలు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి. పత్తి విత్తనాలు విక్రయిస్తున్న షాపుల్లో నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, ప్రిన్సిపల్ రిజిస్టర్లు సహా ఇతర రికార్డులు తనిఖీ చేశారు. లోపాలు గుర్తించి షాపుల్లో రూ.4.89లక్షల విలువైన 534 పత్తి విత్తన ప్యాకెట్లు విక్రయాలు నిలిపివేస్తూ స్టాప్‌సేల్ ఉత్తర్వులు జారీ చేశారు. విత్తన విక్రయాల్లో నిబంధనలు పాటించకుంటే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో జిల్లా వనరుల కేంద్రం(పెద్దాపురం) డిప్యూటీ డైరెక్టరు బీవీఎస్ హరి, జీబీ కరుణాకర్, వెంకటలక్ష్మిలు పాల్గొనగా, వారి వెంట గొల్లప్రోలు మండల వ్యవసాయాధికారి కేవీవీ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

305 బస్తాల పీడీఎస్ బియ్యం స్వాధీనం

జగ్గంపేట, జూన్ 11: అక్రమంగా తరలిస్తున్న పీడీ ఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. ఏపీ39 టీక్యూ 3229 టాటా ఐచర్ వాహనంలో పీడీఎస్ బియ్యం వెళుతున్న సమాచారంతో విజిలెన్స్ అధికారులు, రెవెన్యూ సివిల్ సప్లయ్స్ అధికారులు తనిఖీ చేయగా 305 బస్తాల 15,250కిలోల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించారు. పీడీఎస్ బియ్యం పిఠాపురం మండలం బి.ప్రత్తిపాడుకు చెందిన బి.లచ్చబాబుకు చెందినవి. వ్యా న్ డ్రైవర్ నామాల వీరబాబు వెలుగు గంగరాజుదిగా గుర్తించారు. ఈ బియ్యాన్ని పిఠాపురం నామాల వీరబా బు జగ్గంపేటలోని పౌల్ట్రీ ఫార్మ్‌లకు రవాణా చేస్తుండగా సివిల్ సప్లయిస్ అధికార్లు పట్టుకున్నారు. పీడీఎస్ బియ్యం సుమారు రూ.10,93,875లు విలువైన 15,250కేజీలు. అక్రమంగా తరలిస్తున్నందుకు 6ఏ కింద కేసు నమోదు చేసి బియ్యం స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదుకు పోలీస్‌స్టేషన్‌కు సిఫార్సు చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు భార్గవమహేష్‌వలి, వీరబాబు, సీఎస్‌డీటీ కృష్ణ పాల్గొన్నారు.

ఏపీఈఏపీసెట్ ఫలితాలు విడుదల

- కాకినాడ జిల్లాలో ఇంజనీరింగ్‌లో 6,495 మంది విద్యార్థుల అర్హత
- అగ్రికల్చర్ ఫార్మసీలో అర్హులైన 2,873 మంది విద్యార్థులు

జేఎన్టీయూకే, జూన్ 11: రాష్ట్రవ్యాప్తం గా ఉన్న ఇంజనీరింగ్, అగ్రికల్చర్ ఫార్మసీ కళాశాలల్లో సీట్ల భర్తీకోసం మే 16 నుంచి 23 వరకూ ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఏపీఈఏపీసెట్ ప్రవేశపరీక్షా ఫలితాలను మంగళవారం విజయవాడలో రాష్ట్ర ఉన్న త విద్య ప్రధాన కార్యదర్శి జె.శ్యామలరావు విడుదలచేసినట్లు సెట్ ఛైర్మన్, జేఎన్టీయూకే ఉపకులపతి జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. కాకినాడ జిల్లాలో మూడు కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు ఇంజనీరింగ్ విభాగంలో 4,437మంది బాలురు హాజరు కాగా3,412మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికల విభాగంలో 3,869 మందికిగాను 3083మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. అగ్రికల్చర్ ఫార్మసీ విభాగంలో జిల్లాలో 715మంది బాలురు హాజరుకాగా 612మంది, 2621మంది బాలికలు హాజరుకాగా 2261 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 6,459మంది విద్యార్థులు ఇంజనీరింగ్ విభాగంలో హాజరుకాగా 5,425మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. అగ్రికల్చర్ ఫ్మార్మసీ విభాగంలో 2,557మంది హాజరుకాగా 2,269మంది అర్హులయ్యారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మొత్తం 3,040మంది విద్యార్థులు ఇంజనీరింగ్ విభాగంలో హాజరుకాగా 2,330మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. అగ్రికల్చర్ ఫార్మసీ విభాగంలో 1,244మంది హాజరుకాగా 1,115మంది ఉత్తీర్ణత సాధించారన్నారు.

జిల్లాల్లో ఉత్తమ ర్యాంకులు

కాకినాడ జిల్లాలో ఏపీఈఏపీసెట్ ఫలితాల్లో ఇంజనీరింగ్ విభాగంలో మారిశెట్టి సాయిచరణ్ 22వ ర్యాంకును, గొల్లపల్లి ఫణీంద్ర 47వ ర్యాంకును, బిక్కిన రోహిత్‌చౌదరి 57వ ర్యాంకు ను, అంగాడి చరణ్‌ఉమేష్ 112, ఎం.విశ్వజ్ 129, ఎంబీఎస్ అరవింద్ 153, ఎం.విశ్వక్ 166, సీహెచ్ శ్రీకర్ 170, సీహెచ్ఆర్ ఎన్ తేజ 201, ఏహెచ్ఎస్ నిహంత్ 205 ర్యాంకులు సాధించారు.

- తూర్పుగోదావరి జిల్లాలో బి.రఘురామసహన్ 25వ ర్యాంకును, వీవీఎస్‌డీ సాయిమోహిత్ 40, జిసత్యనారాయణ 56, ఆర్.పవిత్ర 74, కె.ప్రవీణ్ సిద్ధార్థ 76, పీఎన్ఎస్ సత్య 147, కేఎస్. ప్రణవ్ 159, ఎస్‌డీవీ సతీష్ 165, కేఎస్‌టీ అనురూప్ 189, ఎం.మణికంఠ 200 ర్యాంకులను పొందారు.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో బిసాయినరేన్ 51, బీకే సువర్ణ 100,ఎంజీవీ మహేష్ 105, కేఎస్‌పవన్ 185, వి.సహంత్ 187,జీఎన్‌వీ దుర్గాసాయి 240,సీహెచ్ఎస్ఎం వర్మ397, వైఎస్ఆర్ కార్తీక్ 444, ఎస్ఏ సుల్తానా 477, బీఎస్‌డీ మహేష్ 523 ర్యాంకులను సాధించారు.
- కాకినాడ జిల్లాలో అగ్రికల్చర్ ఫార్మసీ విభాగంలో కాకినాడ శ్రీనగర్‌కు చెందిన దామిశెట్టి సిద్ధార్థ 11వ ర్యాంకును, పిఠాపురంనకు చెందిన నిమ్మకాయల హెచ్‌డీ శర్వణసత్యరవికిరణ్ 13వ ర్యాంకును, కాకినాడ వెంకటేశ్వరనగర్‌కు చెందిన యండమూరి నమితరాణి 31వ ర్యాంకును, చీడిగకు చెందిన కొత్తలంక సాయిబాలత్రిపురసుందరి 67వ ర్యాంకును, కాకినాడ అశోక్‌నగర్‌కు చెందిన ఎం.విశ్వంత్ 79వ ర్యాంకును, చిత్రాడకు చెందిన టి.జనన్య 97వ ర్యాంకును, డి.నవీన్‌తేజ 113, ఆర్ఎంఎస్ఎస్ రామగోపాల్ 114, పి.స్వర్ణాంజలి 128, వి.అభిశ్యామ్ 195 ర్యాంకులను కైవసం చేసుకున్నారు.

ఏపీ ఈఏపీసెట్-2024లో సత్తా చాటిన తిరుమల విద్యార్థులు



ఏపీ ఈఏపీసెట్ ఫలితాలలో ర్యాంకులు సాధించిన తిరుమల విద్యార్థులు

రాజమహేంద్రవరంరూరల్ జూన్11: ఏపీ ఈఏపీసెట్-2024 పరీక్షా ఫలితా ల్లో రాజమహేంద్రవరంరూరల్ మండలం కాతేరులోని తిరుమల విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంక్‌లు సాధించారు. అగ్రికల్చర్‌లో ఎస్.రాధాకృష్ణ, 10వ ర్యాంక్, పీఎస్ సంపత్‌నాయుడు 28వ ర్యాంక్, డి.ప్రభాస్ 41వ ర్యాంక్, ఎస్.సాకేత్ రాఘవ 43వ ర్యాంక్, జి.సాయికృష్ణశ్రీ 64వ ర్యాంక్, పి.బేబిఅభిఘ్న 87వ ర్యాంక్, డి.తేజశ్విని 96వ ర్యాంక్, టి.జనన్య 97వ ర్యాంక్, ఆర్ఎల్ నాగవెంకట దుర్గాప్రసాద్ 100వ ర్యాంక్‌ను కైవసం చేసుకున్నారని తెలిపారు. వెయ్యిలోపు ర్యాంక్‌లను 60 మంది, 2వేలలోపు ర్యాంక్‌లను 90మంది, 5వేలలోపు ర్యాంక్‌లను 197 మంది, పదివేలలోపు ర్యాంక్‌లను 311మంది సాధించారు. ఇంజనీరింగ్‌లో 51వ ర్యాంక్‌ను బి.సాయినరేన్, 56వ ర్యాంక్‌ను జి.సత్యనారాయణ, 74వ ర్యాంక్‌ను ఆర్.పవిత్ర, 76వ ర్యాంక్‌ను కె.ప్రవీణ్ సిద్ధార్థ్ సాధించారన్నారు. వెయ్యిలోపు 119 మంది, 2వేలలోపు 252 మంది, ఐదువేలలోపు 562 మంది, పదివేల లోపు 865మంది ర్యాంక్‌లు సాధించారు. విద్యార్థులను, అధ్యాపకులను ఛైర్మన్ నున్నతిరుమలరావు, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ శ్రీహరి అభినందించారు.

ఆదిత్య విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు

కాకినాడ రూరల్, జూన్ 11: ఏపీఈఏపీసెట్-2024 ఫలితాల్లో ఆదిత్య విద్యార్థులు ప్రతిభ కనబరచి అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు ఆదిత్య కార్యదర్శి ఎన్.కృష్ణదీపక్‌రెడ్డి తెలిపారు. అగ్రికల్చర్‌ఫార్మసీలో ఎన్‌హెచ్‌డీఎస్ సత్యరవికిరణ్ రాష్ట్రస్థాయిలో 13వ ర్యాంకు, వై.నైమితారాణి 31వ ర్యాంకు, కేఎస్‌టీ త్రిపురసుందరి 67, విప్పర్ల సృజన్ 76, మోటిపల్లి విశ్వంత్ 79వ ర్యాంకు సాధించారన్నారు. ఇంజనీరింగ్‌లో బి.రఘురామసహన్ 25వ ర్యాంకు, గొల్లపల్లి ఫణీంద్ర 47వ ర్యాంకు, బిక్కిన రోహిత్‌చౌదరి 57, బి.కల్కిసువర్ణ 100వ ర్యాంకు పొందినట్లు తెలిపారు. అగ్రికల్చర్ ఫార్మసీలో 114, 156, 198, 205 ర్యాంకులను ఇంజనీరింగ్‌లో 112, 129, 153, 166, 170 ర్యాంకులను సాధించారన్నారు. ప్రతిభ కనబరచి ఉత్తమర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆదిత్య ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి, డైరెక్టర్లు లక్ష్మీరాజ్యం, శృతి, సుగుణ, ప్రిన్సిపాల్ మొయినా తదితరులు అభినందించారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి

కిర్లంపూడి, జూన్ 11: కాకినాడజిల్లా కిర్లంపూడిలో ప్రధాన రహదారిపై బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. దీనికి సంబంధించిన ఎస్ఐ జబీర్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దాపురం మండలం గుడివాడ గ్రామానికి చెందిన చాగంటి కొండలరావు(73) బైక్‌పై జగ్గంపేట మండలం నరేంద్రపట్నం వెళ్లి తిరిగి వస్తుండగా కిర్లంపూడి వచ్చేసరికి మలుపులో ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. బస్సు చక్రం కొండలరావు తలపై నుంచి వెళ్లడంతో నుజ్జునుజ్జై అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏజెన్సీ సమాచారం

సంక్షేమ పాలనే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

రంపచోడవరం, జూన్ 11: రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. మంగళవారం విజయవాడలో ఏర్పాటు చేసిన శాసనసభా పక్షనేత ఎన్నిక సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏజెన్సీలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా కృషి చేస్తానన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా చర్యలు చేపడుతానన్నారు.

చంద్రబాబు ప్రమాణస్వీకారానికి తరలివెళ్లిన టీడీపీ శ్రేణులు



చంద్రబాబు ప్రమాణస్వీకారానికి వై.రామవరం నుంచి తరలివెళ్తున్న టీడీపీ శ్రేణులు

వై.రామవరం, జూన్ 11: అల్లూరిజిల్లా వై.రామవరం మండలం నుంచి నేడు గన్నవరంలో జరుగుతున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకార మహోత్సవానికి మంగళవారం అధికసంఖ్యలో టీడీపీ శ్రేణులు తరలివెళ్లారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పల్లాల వెంకటరమణరెడ్డి, మాజీ ఎంపీపీ గొర్లె శ్రీకాంత్, టీడీపీ మహిళా నాయకురాలు మడకం రామలక్ష్మి, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దుర్గమ్మకు మొక్కులు చెల్లించుకున్న నాయకులు



మొక్కులు చెల్లించుకున్న నాయకులు

వరరామచంద్రపురం, జూన్11: ఎన్డీఏ కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలోకి రావడంతో మండలంలోని చొప్పల్లి గ్రామానికి చెందిన బత్తుల బ్రహ్మారాజకుమారి దంపతుల ఆధ్వర్యంలో మొక్కులు తీర్చుకున్నారు. చంద్రబాబునాయుడు రాష్ట్రంలో అధికారంలోకి వస్తే ఘాటీ దుర్గమ్మ ఆలయంలో మొక్కులు తీర్చుకుంటామంటూ అదేవిధంగా రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి గెలవాలని వారు కోరుకోగా వారు అనుకున్నది జరగడంతో చింతూరు ఘాటీ రోడ్డులోని దుర్గాదేవి ఆలయంలో తమ మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో రంగాచారి, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరదలపై అప్రమత్తంగా ఉండాలి



వరద సమీక్షలో సూచనలిస్తున్న తహసీల్దార్

చింతూరు, జూన్11: వర్షాకాలం ఆరంభమైన నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎండీ నజీముల్లాసా పేర్కొన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో మండలస్థాయి వరద సమీక్షా సమావేశం నిర్వహించారు. 43, 48, 53 అడుగుల గోదావరి నీటిమట్టం స్థాయిలో ముంపు, వరదనీటిలో చుట్టుముట్టే గ్రామాలు ముందుగానే గుర్తించాలన్నారు. ఆమేరకు అవసరమయ్యే రేషన్, టార్పాన్లను ముందుగానే సమకూర్చుకోవాలన్నారు. ఇప్పటి నుంచి వరదల కాలం ముగిసే వరకు పెట్రోల్ బంకుల్లో 500 లీటర్లు తగ్గకుండా పెట్రోల్, డీజిల్ నిల్వ ఉంచాలన్నారు. మరపడవలు, బోట్లలో లైఫ్‌జాకెట్లు సిద్ధంగా ఉంచాలని, వైద్యశాఖలో మందులు నిల్వ ఉంచాలని, గర్భిణులను గుర్తించి వారిని ముందుగానే ఆస్పత్రులకు తరలించాలన్నారు.

'కార్పెంటర్లకు సబ్సిడీపై కలప ఇవ్వాలి'



సమావేశానికి హాజరైన కార్పెంటర్లు

ఎటపాక, జూన్ 11: విలీన మండలాల్లో చేతి వృత్తులపై ఆధారపడిన కార్పెంటర్లకు సబ్సిడీపై కలప డిపోల నుంచి కలప ఇవ్వాలని చింతూరు డివిజన్ సూర్యచంద్ర కార్పెంటర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గుంటుపల్లిరాము అన్నారు. మంగళవారం నెల్లిపాక గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో ఏన్నేళ్ల నుంచి చేతి వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న కార్పెంటర్ల పరిస్థితి అధ్వానంగా ఉందని అన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీపై డిపోల నుంచి కలప ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్తగా ఏర్పడే ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పెంటర్లు చీరాల వీరయ్య, గొళ్లపల్లి అప్పల స్వామి, అమరవరపు రాము, వీర భద్రచారి, తదితరులు పాల్గొన్నారు.

ఉండడానికి గూడు లేదు..ఆదుకోండి

● దిక్కుతోచని స్థితిలో నివాసం



పూరి గుడిసెలో నివసిస్తున్న పరమేష్ కుటుంబం

మోతుగూడెం, జూన్ 11: చింతూరు మండలం మోతుగూడెం అల్లూరు కాలనీలో నివసిస్తున్న మురళ్ళ పరమేష్, కన్నమ్మ వీరికి ఇద్దరు పిల్లలు. మురళ్ళపరమేష్ పూరి గుడిసెలో 10 సంవత్సరాల నుంచి ఉంటున్నాడు. ఆరు సంవత్సరాల క్రితం వివాహమైంది. కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇద్దరు పిల్లలు ఎంత పని చేసినా భార్యపిల్లలను పోషించడానికి సరిపోవట్లేదు. రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితిలో జీవిస్తున్నానని ఇంటి నిర్మాణం కోసం ఖర్చు అయ్యేసొమ్ము తమ వద్ద లేద ని వర్షాకాలం వస్తే ఈ ఉన్న గూడు కూడా ఏమైపోతుందో అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు స్పందించి తమకు సాయం అందించాలని పరమేష్ కుటుంబం ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం వారికి ఎన్నిసార్లు తమ గోడును తెలిపినా పట్టించుకోలేదని ఈప్రభుత్వం వారైనా స్పందించి తమకు మేలు చేస్తారని కోరుకుంటున్నామని ఆ దంపతులు వేడుకుంటున్నారు.

మండుతున్న ఎండలు

మోతుగూడెం, జూన్11: చింతూరు మండలం మోతుగూడెం మన్యంలో ఎండలు తీవ్రమవుతున్నాయి. ఏటా జూన్ మొదటి వారంలో ఏజెన్సీలో వాతావరణం చల్లగా మారుతుంది. ఈ సారి భిన్నంగా పరిస్థితులు ఉన్నాయి. గత రెండు రోజుల నుంచి ఎండలు అధికంగా ఉన్నాయి. మంగళవారం మధ్యాహ్నం మోతుగూడెంలో ప్రజలు ఎవ్వరూ బయటికి రాలేదు. ఒకప్రక్క ఉక్కపోత, ప్రధాన రోడ్లు సైతం నిర్మానుషంగా మారింది. అత్యవసర పరిస్థితుల్లో కొంత మంది గొడుగు నీడన బయటకు వస్తున్నారు.

వజ్ర గణపతి ఆలయ వార్షికోత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్, జూన్ 11: వజ్ర గణపతి ఆలయం పదో వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ వాకచర్ల కృష్ణ, సూర్యకుమారి దంపతులు పండ్ల రసాలు, పంచామృతాలతో గణపతికి అభిషేకం చేశారు. అర్చకుడు బుజ్జి భక్తులందరితో గణపతికి అభిషేకాలు చేయించారు. కార్యక్రమంలో వాకచర్ల జయలక్ష్మి, యత్తిరాజ్, సంపత్‌కుమార్, పెరుమాళ్ళ గోపాల్, పెరుమాళ్ళ సత్యనారాయణ, మద్దుల శ్రీనివాస్, వాణి, గొల్లపూడి రామకృష్ణ, కారుమూరి వీర్రాజు పాల్గొన్నారు.



విద్యుద్దీపాలంకరణలో రాజమహేంద్రవరం మునిసిపల్ కార్యాలయ పార్కు



కలెక్టర్ క్యాంపు కార్యాలయం



రాజమహేంద్రవరంలోని రుడా కార్యాలయం

కార్యాలయాలకు కొత్త కళ

- నేడు ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం
- ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు విద్యుద్దీపాలంకరణ
- కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారానికి అధికారుల ఏర్పాట్లు
- కల్యాణ మండపాలు, కళావేదికల వద్ద భారీ స్ర్కీన్లు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 11: విభజిత ఆంధ్రప్రదేశ్ 3వ ముఖ్యమంత్రిగా టీడీపీ అధినేత నారా చంద్రబాబు బుధవారం ప్రమాణస్వీకారం చేస్తు న్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు విద్యుద్దీపాలంకరణ చేశారు. విజయవాడలోని కేసరపల్లి జరిగే చంద్రబాబు ప్రమాణస్వీకారం కార్యక్ర మం వేడుకగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా రాజమహేంద్రవరంలో నగర పాలక సంస్థ కార్యాలయం, ఆర్ట్స్‌కళాశాల, పుష్కరాలఘాట్ రోడ్డులోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయానికి విద్యుద్దీపాలను అలంకరించి ఫోకస్ లైట్లు అమర్చారు. నూతన ప్రభుత్వానికి ఘనంగా స్వాగతం పలికేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. బుధవారం ఉదయం 11:27 గంటలకు చంద్రబాబు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తారు. అప్పటి నుంచి అన్ని ప్రభుత్వ శాఖలలో నూతన ప్రభుత్వ కార్యకలాపాలు ప్రారంభమవుతాయి. చంద్రబాబు ప్రభుత్వం ఏర్పాటుతో అటు ప్రజలు, ఇటు కూటమి నాయకులు, ఉద్యోగుల్లో ఆనందం వ్యక్తమవుతుంది. చంద్రబాబు ప్రమాణస్వీకారాన్ని ప్రజానీకం తిలకించేందుకు రాజమహేంద్రవరంలో పలు చోట్ల ఎల్‌ఈడీ స్ర్కీన్స్ ఏర్పాటు చేశారు.

కోరుకొండ: సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించేందుకు కోరుకొండ మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాట్లు చేసినట్టు ఎంపీడీవో పేర్కొన్నారు. మండలానికి చెందిన జడ్పీటీసీ, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యులు, అందరు సర్పంచ్‌లు ఈ కార్యక్రమానికి విచ్చేయాలని మండల పరిషత్ నుంచి ఆహ్వానాలు పంపినట్టు చెప్పారు.

కొవ్వూరు/తాళ్లపూడి: కొవ్వూరులోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి మాట్లాడారు. చంద్రబాబుతోపాటు కూటమి ఎమ్మెల్యే విజేతల ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం ఉదయం 11:27ని.లకు గన్నవరం మెగా ఐటీ పార్క్‌లో జరుగుతుందన్నారు. కార్యక్రమానికి వీక్షించేందుకు కొవ్వూరులోని యువరాజ్ కల్యాణ మండపంలో, తాళ్లపూడి మండలం బల్లిపాడులోని కాకర్ల కల్యాణ మండపంలో, చాగల్లు కల్యాణ మండపంలో ఎల్‌ఈడీ స్ర్కీన్‌లను ఏర్పాటుచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మద్దిపట్ల శివరామకృష్ణ, సూర్యదేవర రంజిత్, వట్టికూటి వెంకటేశ్వరరావు, బేతిన నారాయణ, బర్ల శ్రీనివాసరావు, కె.సాంబయ్య, గెల్లా సురేష్, నాళం శ్రీనివాసరావు, కేవీకే రంగారావు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన లైటింగ్

పెరవలి: సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమం ప్రత్యక్ష ప్ర సారానికి పెరవలి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాట్లు చేసినట్టు ఎంపీ డీవో హిమామహేశ్వరి తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల ప్రజా ప్రతి నిధులు, ప్రజానీకం, ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి తిలకించాలని కోరారు.

అనపర్తి: ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని ప్రజలంతా తిలకించేందుకు వీలుగా అనపర్తిలోని తేతలి రామిరెడ్డి మంగయ్యమ్మ కళావేదికలో అధికారులు స్ర్కీన్ ఏర్పాటు చేస్తున్నారు. సదరు ఏర్పాట్లను మంగళవారం సాయంత్రం టీడీపీ నాయకులు తమలంపూడి సుధాకరరెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి, మల్లిడి ఆదినారాయణరెడ్డి పరిశీలించి సీఐ శివగణేష్, ఎస్ఐ రామారావులతో చర్చించారు. వీక్షించేందుకు వచ్చే వారి కోసం కుర్చీలు ఏర్పాటు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

ఉత్తరాంధ్ర వాసులకు అనంతపల్లిలో అల్పాహారం

నల్లజర్ల, జూన్ 11: విజయవాడలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్న చంద్రబాబు సభ స్థలానికి వెళుతున్న ఉత్తరాంధ్ర వాసులకు నల్లజర్ల మండలం అనంతపల్లిలో జేఎస్ఆర్ కల్యాణ మండపంలో మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్ ఆధ్వర్యంలో అల్పాహారం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానికులకు సైతం అల్పాహారంతోపాటు అక్కడే ప్రమాణస్వీకారం కార్యక్రమాన్ని వీక్షించేందుకు స్ర్కీన్ ఏర్పాటు చేశారు.

చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి వేలాదిగా వెళుతున్నాం..

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 11: ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో వేలాదిగా పాల్గొంటున్నామని టీడీపీ రాజమహేంద్రవరం ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా, పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబు అన్నారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రాజమహేంద్రవరంలో 72 వేల మెజార్టీతో ఆదిరెడ్డి శ్రీనివాస్ చరిత్ర సృష్టించారన్నారు. నగరంలో సమస్యలను ఆయన పరిష్కరిస్తారన్నారు. రాజమహేంద్రవరం టీడీపీ కార్యాలయం నుంచి బుధవారం తెల్లవారుజామున కార్లు, బస్సుల్లో వెళుతున్నామన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు సూరంపూడి శ్రీహరి, పోలాకి పరమేష్, అడ్డగర్ల ఆనంద్, బంగారు నాగేశ్వరరావు, చింతపల్లి నాని, సలాది ఆనంద్, పిల్లి శ్యామ్, శనపతి సత్తిబాబు, కిలపర్తి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



నన్నయ విశ్వవిద్యాలయం కేంద్ర పరిపాలనా భవనం



కొవ్వూరు సమావేశంలో మాట్లాడుతున్న ద్విసభ్య కమిటీ సభ్యులు



పెరవలి ఎంపీడీవో కార్యాలయం



అనపర్తిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు, పోలీసులు

మిరుమిట్లు గొలుపుతున్న నన్నయ వర్సిటీ

దివాన్‌చెరువు, జూన్ 11: నూతన ప్రభుత్వం బుధవారం కొలువుదీరనున్న సందర్భంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని భవనాలను రంగురంగుల విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. యూనివర్శిటీలోని కేంద్ర పరిపాలనా భవనం, బీఆర్ అంబేడ్కర్ కేంద్ర గ్రంథాలయ భవనం, ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్, ఇంజనీరింగ్ కళాశాల భవనం, ప్రధాన ద్వారం వద్ద విద్యుద్దీపాలంకరణ చేసినట్టు విశ్వవిద్యాలయ వర్గాలు వివరించాయి. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఈ ఏర్పాట్లు చేశారు. దీంతో నన్నయ వర్శిటీ భవనాలు విద్యుత్ వెలుగులతో మిరుమిట్లు గొలుపుతున్నాయి

ప్రధాని ప్రతిమకు ముసుగు తొలగించని రైల్వే



రాజమహేంద్రవరం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో అడుగు పెట్టిన వెంటనే కుడి చేతి వైపున చక్కటి ప్రతిమలు స్వాగతం చెబుతూ కనిపిస్తాయి. కేంద్ర ప్రభుత్వ నినాదంతో వీటిని ఇక్కడ ఏర్పాటు చేశారు. ఈ బొమ్మల్లో ప్రధాని మోదీ ప్రతిమ కూడా ఉంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం మోదీ ప్రతిమకు తెల్లటి వస్త్రంతో ముసుగు వేశారు. అయితే ఎన్నికల నియామావళిని ఎత్తేశారు. మోదీని ప్రధానిగా ఎన్నుకొని వారం గడిచింది. ఆయన దేశ ప్రధానిగా మూడోసారి ప్రమాణ స్వీకారం చేసి రెండు రోజులు పూర్తయింది. అయినా అధికారులు ఆ ముసుగును తొలగించలేదు. పైగా ఆ ప్రతిమల కొలువు వద్ద ఎలాంటి నినాదాలు/సూక్తులు లేవు. దేశ ప్రధాని విషయంలో రైల్వే అధికారుల నిర్లక్ష్యంపై ప్రయాణికులు విస్తుపోతున్నారు.

శ్రీరామ భక్తులకు వసతి, అన్నదానం

బిక్కవోలు, జూన్ 11: జంగారెడ్డిగూడెం, పరిసర గ్రామాల నుంచి అన్నవరం వెళ్తున్న 200 మంది శ్రీరామ భక్తులకు సోమవారం రాత్రి బిక్కవోలులో టీడీపీ నేతలు వసతి, భోజన ఏర్పాట్లు చేసారు. టీడీపీ నేతలు పల్లి వాసు, చాగంటి సాయిబాబారెడ్డి, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి వీరికి స్థానిక అన్నదాన సత్రంలో భోజన ఏర్పాట్లు చేసి వసతి ఏర్పాటు చేసారు.

దోమల నియంత్రణ ప్రతిఒక్కరి బాధ్యత



రాజానగరం, జూన్ 11: దోమల నియంత్రణ ప్రతిఒక్కరి బాధ్యత అని రాజానగరం పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్‌సీహెచ్ వెంకటలక్ష్మి అన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ వరకూ మలేరియా వ్యతిరేక మాసోత్సవం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో కృపాబాయి, ఎంపీహెచ్ఎస్ ఎస్‌వీవీ రమణ, హెచ్‌వీ రత్నకుమారి, ఎల్‌టీ సతీష్, పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు

శ్యామలాంబకు మొక్కు చెల్లించిన ఆదిరెడ్డి



రాజమహేంద్రవరం సిటీ, జూన్ 11: రాజమహేంద్రవరం ఎమ్మెల్యేగా ఆదిరెడ్డి శ్రీనివాస్ ఘన విజయం సాధించిన సందర్భంగా రాజమహేంద్రవరం 29వ డివిజన్‌లో శ్యామలాంబ అమ్మవారిని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, వీరరాఘవమ్మ దంపతులు దర్శించుకుని 101 కొబ్బరికాయలు కొట్టి తమ మొక్కును తీర్చుకున్నారు. 29వ డివిజన్ నాయకులు కేక్ కట్ చేయించి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో కడియాల వీరభద్రరావు, కడియాల వాసు, కడియాల శ్యామ్ కుమార్, దొండపాటి సత్యంబాబు, చల్లగాలి రాజు, గోవిందు, కర్రీ సతీష్, అట్లాడ రవి, చాపల రాజు, దాస్యం ప్రసాద్, వీర్రాజు పాల్గొన్నారు.

రైతు బజార్‌లో కుళ్లిన ఉల్లిపాయలు

కిలో రూ.30కు విక్రయాలు.. చోద్యం చూస్తున్న అధికారులు



మార్కెట్‌యార్డు రైతుబజార్‌లో విక్రయిస్తున్న నాణ్యతలేని ఉల్లిపాయలు

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 11: రాజమహేంద్రవరం-కోరుకొండ రోడ్డు, శంభూనగర్ రైతుబజార్లలో మంగళవారం కుళ్లిన ఉల్లిపాయలను అధిక రేట్లకు విక్రయించడం విమర్శలకు తావిచ్చింది. మంగళవారం రాజమహేంద్రవరంలోని అన్ని రైతు బజార్లలో ఉల్లిపాయలు కిలో రూ.30 ధర పెట్టారు. ఈ ధరకు బహిరంగ మార్కెట్‌లోనే మంచి ఉల్లిపాయలు దొరకుతాయి. బహిరంగ మార్కెట్‌తో పోల్చితే రైతు బజారులో మరింత తక్కువకే ఉల్లిపాయలు లభించాలి. మార్కెట్‌యార్డు రైతు బజారులో మాత్రం అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఉల్లిపాయల వ్యాపారుల ఇష్టారాజ్యం కొనసాగింది. నాణ్యత లేకపోయినా ధర దారుణంగా ఉండడంతో రైతు బజార్ నిర్వహణపై వినియోగదారులు తీవ్ర అంసతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అలాగే టమాటా ఎక్కువకు అమ్ముతున్నారనే ఫిర్యాదులున్నాయి. రైతు బజార్ ఎస్టేట్ అధికారి దీనిపై దృష్టిసారించాల్సి ఉంది.

నైపుణ్య శిక్షణ ఖైదీలకు ఉపయోగకరం



డీఎల్ఎస్ఏ ఇన్‌చార్జి కార్యదర్శి అనురాధ

రాజమహేంద్రవరం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): జైలులో నైపుణ్య శిక్షణ ఖైదీలు విడుదలైన తర్వాత జీవనోపాధికి ఎంతగానో ఉపయోగపడుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.అనురాధ పేర్కొన్నారు. సెంట్రల్ జైలులోని నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఆమె మంగళవారం సందర్శించారు. అదనంగా ఇంకా మరిన్ని విభాగాల్లో శిక్షణ అవసరమైతే ఆ దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ఖైదీలతో మాట్లాడి కేసు వివరాలు, సమస్యలపై ఆరా తీశారు. ఖైదీలకు అందుబాటులో ఉన్న ఉచిత న్యాయసేవలను వివరించారు. ఎలాంటి న్యాయ సహాయం అవసరమైనా డీఎల్ఎస్ఏకి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో జైలర్ ఆర్.శ్రీనివాసులు, నేషనల్ అకాడమి ఆఫ్ కనస్ట్రక్షన్ అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీరు సక్రమంగా అందించాలి: ఎంపీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రసాద్

కడియం, జూన్ 11: తాగునీరు, పారిశుధ్య విషయంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్యప్రసాద్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో వివిధ గ్రామాల్లో బొమ్మూరు నుంచి వచ్చే తాగునీరు పైపులైను లీకేజీలు ఎక్కువగా ఉన్నాయని, తద్వారా ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని, పైపులైన్లు పాడయితే వారం పది రోజుల వరకు నీరందడం లేదని దానిపై ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ప్రతీ గ్రామం వెళ్లి పైపులైన్లు పాడైతే వాటిని బాగుచేయించే చర్యలు తీసుకోవాలన్నారు. మరమ్మతులకు అవసరమైతే మండల నిధులు కూడా సమకూరుస్తామన్నారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాల న్నారు. మురుగునీరు, వర్షపునీరు నిల్వ ఉండకుండా చూడాలని, ప్రజలకు సురక్షిత నీరు అందించాలని, పారిశుధ్య పనులు చేపట్టాలని చెప్పారు. సచివాలయ ఉద్యోగులు ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నెహ్రూకు మంత్రి వర్గంలో చోటు దక్కాలి

తంటికొండ వెంకన్న కొండపైకి మోకాళ్లపై ఎక్కిన అభిమాని




కొండపైకి మోకాళ్లపై ఎక్కుతున్న లక్ష్మీనారాయణ

గోకవరం, జూన్ 11: జగ్గంపేట కూటమి ఎమ్మెల్యే విజేత జ్యోతుల నెహ్రూకు మంత్రి వర్గంలో స్థానం దక్కాలంటూ ఆయన అభిమానులు మొక్కులు చెల్లిస్తు న్నారు. మంగళవారం మండలంలోని రంప యర్రంపాలెం గ్రామా నికి చెందిన గుడిసె లక్ష్మీనారాయణ తంటికొండ వేంకటేశ్వరస్వామి కొండ పైకి మెట్ల మార్గం ద్వారా మోకాళ్లపై ఎక్కి మొక్కు తీర్చుకున్నాడు. అనంతరం స్వామి వారిని దర్శించుకొని 108 కొబ్బరి కాయలను కొట్టి ఎమ్మెల్యే విజేత నెహ్రూకు మంత్రి పదవి దక్కాలలని స్వామిని వేడుకు న్నాడు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మంగరౌతు రాము, ఉంగరాల రాము, బదిరెడ్డి అచ్చన్నదొర, ఉంగరాల గణేష్, గెడ్డం బాబు పాల్గొన్నారు.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

జిల్లాలో 29 డిజిటల్ స్క్రీన్లపై ప్రత్యక్ష ప్రసారం

రాజమహేంద్రవరం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభు త్వ ప్రమాణస్వీకారోత్సవాన్ని ప్రజలంతా కళ్లారా చూడాలని ఆశపడుతున్నారు. ఇప్పటికే లక్షలాది మంది తరలివెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. వెళ్లలేని ప్రజలు పెద్దతెరలమీద ప్రత్యక్షంగా చూసేలా చేయడానికి కలెక్టర్ మాధవీలత జిల్లాలో 29 చోట్ల డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటు చేయించారు. రాజమహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆనం కళాకేంద్రం, సుబ్రహ్మణ్య మైదానం, ఏవీఏ రోడ్డులోని రామాలయం సెంటర్, పుష్కరఘాట్, ఎంఎస్ఆర్ హైటెక్ బస్టాండ్, ఆల్‌కట్‌గార్డెన్స్‌లోని మునిసిపల్ కల్యాణమండపం, స్టేడియం, క్వారీ పేట సెంటర్, రైతు తాతాలు కల్యాణ మండపంలో స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. అనపర్తిలోని కళావేదిక, బిక్కవోలు కాపుల కల్యాణ మండపం,రంగంపేట మండలం వడిశలేరులోని కాకతీయ కమ్మ కల్యాణ మండపం, దేవరపల్లిలోని ఆర్య వైశ్య కల్యాణ మండపం, గోపాలపురంలోని ఆర్య వైశ్యకల్యాణ మండపం, నల్లజర్లలోని ఎంపీడీవో ఆఫీసు, గోకవరం మండలం కొత్తపల్లిలోని ఆదర్శ పార్మసీ కాలేజీ, కొవ్వూరు అర్బన్ యువరాజు ఫంక్షన్ హాల్,కొవ్వూరు రూరల్‌లో ఎంపీడీవో ఆఫీసు,తాళ్లపూడి పం చాయతీ, చాగల్లులోని సుబ్రహ్మణ్యే శ్వర ఆడిటోరియం, నిడదవోలు రూరల్ సమిశ్రగూడెం గీతా మందిరం, నిడదవోలు అర్బన్ రోటరీ ఫంక్షన్‌హాల్, ఉండ్రాజ వరంలో శివా లయం సెంటర్,పెరవలి ఎంపీడీవో ఆఫీసులో స్క్రీన్స్ ఏర్పాటుచేశారు.


ఇదే విక్టరీ : టీడీపీ అధినేత చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్

నేడు మహా పండుగ

(కాకినాడ/రాజమహేంద్రవరం/అమలాపురం-ఆంధ్రజ్యోతి)

సంబరం...మహా సంబరం.. ఓటుతో ప్రజాస్వామ్యాన్ని గెలి పించి ప్రజాప్రభుత్వం ఏర్పాటుకు పాటుపడ్డ ప్రతి ఒక్కరి పం డగ నేడు. చరిత్రను తిరగరాస్తూ, రికార్డుల మోత మోగిస్తూ, ప్రజాకంటక పాలనను ఊచకోత కోసి సరికొత్త నవశకానికి నాంది పలికిన ప్రజల ఆకాంక్షలు ప్రతిఫలిస్తోన్న క్షణాలు నేడు. చరిత్రను తిరగరాస్తూ ఇచ్చిన సునామీ తీర్పుతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి ఏకంగా 22 మంది ఎమ్మెల్యేలు ఠీవీగా నిలబడుతోన్న గడియలివి.ఈరోజు ఉదయం చంద్ర బాబు 11.27 గంటలకు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పండగ వాతా వరణం నెలకొంది. ప్రమాణ స్వీకారాన్ని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజలు వీక్షించేలా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కాకినాడ జిల్లా పరిధిలో 19 ఏర్పాటు చేయగా, కాకినాడ కార్పొరేషన్ పరిధిలో 9 చోట్ల ఏర్పాటు చేశారు. తూర్పుగోదావరి జిల్లా పరిధిలో 29 , కోనసీమ జిల్లాలో 20 స్క్రీన్లు సిద్ధం చేశారు.ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కలెక్టరేట్లు, ఇతర ప్రభుత్వ కార్యాల యాలు విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు.సీఎంగా చంద్ర బాబుతో పాటు పిఠాపురం ఎమ్మెల్యేగా తొలి సారిగా విజయం సాధించిన పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎంగా ప్రమాణస్వీకారం చేయనున్నారు.ఉమ్మడి జిల్లాకు ఇంకో రెండు వరకు దక్కనున్న బెర్త్‌ల కోసం సీనియర్లు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తు న్నారు. వీరితో పాటు ఈ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా నుంచి ఏకంగా 12 మంది తొలిసారిగా ఎమ్మెల్యేలుగా గెలిచారు.వీళ్లు సైతం అమాత్య పదవికి ప్రయత్నాలు చేస్తున్నారు. 17న అసెంబ్లీలో వీరంతా ప్రమాణస్వీకారం చేయనున్నారు.

- సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం
- ఉమ్మడి జిల్లాలో కూటమి ప్రభంజనం
- 22 మంది ఎమ్మెల్యేలు హాజరు
- జిల్లా నుంచి ఏకపక్ష మద్దతు
- ఎన్నికల చరిత్రలో కొత్త రికార్డులు
- డిప్యూటీ సీఎంగా పవన్ కల్యాణ్
- జిల్లాకు మరో రెండు మంత్రి పదవులు?
- కేబినేట్‌లో బెర్త్‌కు తీవ్ర ప్రయత్నాలు
- నాయకులంతా అమరావతిలోనే మకాం
- 12 మంది తొలిసారిగా ఎమ్మెల్యేలు
- ఈ నెల 17న అసెంబ్లీలో ప్రమాణం

డిప్యూటీ సీఎంగా పవన్..

నేడు ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం నేపథ్యంలో కేబినేట్‌లో ఎవరెవరికి ఛాన్స్ ఉం టుందనే చర్చ ఉత్కంఠగా మారింది. ప్రధానంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు రెండు నుంచి మూడు మంత్రి పదవులు దక్కనున్నాయి. 2014లో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఉమ్మడి జిల్లా నుంచి యనమల,రాజప్పలకు మంత్రి పదవులు లభించాయి.ఈ సారి మంత్రి పదవులు రెండు లేదంటే మూడు వరకు కేటాయించవచ్చనే చర్చ సాగుతోంది. జనసేన నుంచి ఆరుగురు ఎమ్మెల్యేలు ఉండగా ఒకరిద్దరికి ప్రాతినిధ్యం కల్పించాల్సి ఉంది. పిఠాపురం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన పవన్ కల్యాణ్‌కు కేబినెట్‌లో డిప్యూటీ సీఎం పదవి ఖాయమైంది. బుధవారం చంద్రబాబు ప్రమాణ స్వీకారం అనంతరం పవన్ డిప్యూటీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. పవన్‌ను మినహాయిస్తే ఉమ్మడి జిల్లాకు మంత్రి పదవులు ఎన్ని ఇస్తారనేది సస్పెన్స్‌గా మారింది. మంత్రివర్గంలో చోటు కోసం కాకినాడ జిల్లా నుంచి యనమల, రాజప్ప, జ్యోతుల నెహ్రూ రేసులో



ఉన్నారు.రాజమహేంద్రవరం జిల్లా నుంచి సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, జనసేన నుంచి నిడదవోలు ఎమ్మెల్యే కందుల దుర్గేష్.కోనసీమ జిల్లా నుంచి ముమ్మిడివరం,అమలాపురం ఎమ్మెల్యేలు దాట్ల సుబ్బరాజు,అయితాబత్తుల ఆనందరావు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు.సీనియర్ ఎమ్మెల్యేలు బుచ్చయ్య చౌదరి,జ్యోతుల నెహ్రూ పేర్లు బాగా వినిపి స్తున్నాయి. జనసేనకు పవన్‌తో పాటు మరొక మంత్రి పదవి ఇవ్వాలనే డిమాండ్ ఉన్న నేపథ్యంలో కందుల దుర్గేష్ పేరు వినిపిస్తోంది. పవన్‌తో పాటు ఉమ్మడి జిల్లాలో అమాత్య పదవి ఎవరిని వరించనుందో చూడాలి.

బలమంతా 'తూర్పు'దే...

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఓట్ల వరద పొంగింది. అధికార వైసీపీని నిండా ముంచేసింది. తిరిగి పైకి లేవలేనంతంగా భూస్థాపితం చేసింది. కూటమికి అనన్య సామాన్యమైన విజయాన్ని అందించింది. ఫలితంగా ఎన్నికల చరిత్రలో మునుపెన్నడూ కనివినీ ఎరుగని రీతిలో ఏకంగా 22 మంది ఎమ్మెల్యేలు టీడీపీ, జనసేన,బీజేపీ నుంచి విజయం సాధించారు. ఇంత వరకు ఏ పార్టీకి ఉమ్మడి జిల్లాలో రానన్ని సీట్లు, చూడనంత వేలాది ఓట్ల మెజార్టీలతో ఓట్లాభిషేకం చేశారు. రాష్ట్రంలో అత్యధిక మెజార్టీల జాబితాలో జిల్లా నుంచి అనేక మంది ఎమ్మెల్యేలు స్థానం దక్కించుకున్నారు. వాస్తవానికి అసెంబ్లీ ఎన్నికల్లో అధికార వైసీపీ సీట్లను చాలా వరకు ముందే ప్రకటించింది. కానీ కూటమి తరఫున టీడీపీ,జనసేన ఆచితూచి అభ్యర్థులను ఎంపిక చేశాయి.కూటమి తరఫున నిలబడ్డ అభ్యర్థులందరిని అఖండ మెజార్టీతో గెలిపించారు. కాకినాడ, రాజమహేంద్రవరం,అమలాపురం మూడు పార్లమెంట్ల పరిధిలోని స్థానాలు, రంపచోడవరం అసెంబ్లీ సీటుతో కలిపి మొత్తం 22 స్థానాలను కూటమి కైవసం చేసుకుంది.ఇందులో టీడీపీ 15, జనసేన ఆరు, బీజేపీ ఒక సీటు దక్కించుకున్నాయి. ఒక్కటంటే ఒక్క సీటు కూడా వైసీపీకి దక్కకుండా ప్రజలు కసి తీరా ఓటమి రుచి చూపించారు. ఉమ్మడి జిల్లా నుంచి 22 చోట్ల విజయం సాధించిన కూటమి ఎమ్మెల్యేల్లో ఏకంగా 12 మంది తొలిసారి ఎమ్మెల్యేలుగా విజయం సాధించడం అనేక రికార్డులను తిరగరాసింది. ప్రధానంగా కాకినాడ పార్లమెంట్ పరిధిలో తుని నుంచి యనమల దివ్య (టీడీపీ), ప్రత్తిపాడు నుంచి వరుపుల సత్యప్రభ (టీడీపీ), పిఠాపురం నుంచి పవన్ కల్యాణ్(జనసేన), కాకినాడరూరల్ నుంచి పంతం నానాజీ(జనసేన) తొలి సారిగా ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. రాజమహేంద్ర వరం పార్లమెంట్ పరిధిలో రాజమహేంద్రవరం సిటీ నుంచి ఆదిరెడ్డి శ్రీనివాసు(టీడీపీ),గోపాలపురం నుంచి మద్దిపాటి వెంకటరాజు(టీడీపీ), రాజానగరం నుంచి బత్తుల బలరామకృష్ణ(జనసేన), నిడదవోలు నుంచి కందుల దుర్గేష్(జనసేన), అమలాపురం పార్లమెంట్ పరిధిలో రామచంద్రపురం నుంచి వాసంశెట్టి సుభాష్ (టీడీపీ), పి.గన్నవరం నుంచి గిడ్డి సత్యనారాయణ (జనసేన),రాజోలు దేవ వరప్రసాద్ (జనసేన), రంప చోడవరం శిరీష(టీడీపీ) విజయం సాధించారు. వీరంతా ఇప్పటికే అమరావతికి చేరుకున్నారు. మంగళవారం విజయవాడలో జరిగిన టీడీఎల్పీ సమావేశంలో శాసనసభాపక్ష నేతగా చంద్రబాబును ఎన్నుకున్నారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారంలో కొత్తగా నెగ్గిన ఎమ్మెల్యేలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు.వీరంతా ఈనెల 17 అసెంబ్లీలో ఎమ్మెల్యేలుగా ప్రమాణస్వీకారం చేయనున్నారు.ఉమ్మడి తూ ర్పుగోదావరి జిల్లా నుంచి ఇంత మంది అసెంబ్లీకి తొలి సారి ఎమ్మెల్యేలుగా వెళ్లడం భారీ రికార్డు అనే చెప్పాలి.


దాట్ల సుబ్బరాజు, ముప్పిడి వెంకటేశ్వరరావు,అయితాబత్తుల ఆనందరావు, బండారు సత్యానందరావు, వాసంశెట్టి సుభాష్



దేవ వరప్రసాద్, గిడ్డి సత్యనారాయణ, పంతం నానాజీ, గోరంట్ల బుచ్చయ్యచౌదరి



యనమల దివ్య, వరుపుల సత్యప్రభ, మిరియాల శిరీషాదేవి, ఆదిరెడ్డి శ్రీనివాసు


లోకేశ్‌ను అభినందిస్తున్న పురందేశ్వరి


వేగుళ్ల జోగేశ్వరరావు, ఎం.వెంకటరాజు


దుర్గేష్

కూటమి సంబరం

ఎన్డీఏ కూటమి సమావేశం మంగళవారం విజయవాడలో నిర్వహించారు.. ఉమ్మడి జిల్లా నుంచి ఎన్నికైన 22 మంది ఎమ్మెల్యేలు హాజర య్యారు..వీరిలో 12 మంది కొత్తవారు కాగా ముగ్గురు మహిళలు. ఎమ్మెల్యేలు ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్, పురందేశ్వరికి అభినందనలు తెలిపారు.


కాంతులీనుతున్న కలెక్టరేట్


కార్యాలయాలకు కళొచ్చింది..


వెలిగిపోతున్న రాజమండ్రి కార్పొరేషన్ కార్యాలయం

కొత్త ప్రభుత్వ ప్రమాణ స్వీకారం నేపథ్యంలో జిల్లాలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు విద్యుత్ కాంతులతో ధగధగ మెరిసి పోతున్నాయి. జిల్లా కలెక్టరేట్, కలెక్టరేట్ క్యాంపు కార్యాలయం, ఆర్ట్స్ కాలేజీ, మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం , దివాన్ చెరువులోని ఆదికవి నన్నయ వర్సిటీ ప్రాంగణం కాంతులీనుతూ హైవే ప్రయాణి కులకు కనులవిందు చేస్తోంది. కొవ్వూరు సబ్- కలెక్టర్ కార్యా లయానికి విద్యుత్ అలంకరణ చేశారు.

పలుచోట్ల విడిది

చంద్రబాబు ప్రభుత్వ ప్రమాణస్వీకారాన్ని ప్రత్యక్షంగా చూడడానికి ఉత్తరాంధ్ర నుంచి వెళ్లే ప్రజలు మధ్యలో కాస్త విశ్రాంతి తీసుకుని, రిఫ్రెష్ కావడానికి జిల్లాలో పలు చోట్ల విడిది ఏర్పాటు చేశారు. దివాన్‌చెరువులోని ఎస్వీపీసీ కన్వెన్షన్, కాతేరు వెంకటాద్రి, దేవరపల్లిలోని డైమండ్ సెంటర్, నల్లజర్లలోని జేఎస్వీఆర్ కల్యాణ మండపంలోనూ సౌకర్యాలు ఏర్పాటు చేశారు. రాత్రంతా ప్రయాణించి తెల్లారేసరికి అక్కడకు చేరుకునే వారికి స్నానపానాదుల సౌకర్యం, బ్రేక్‌ఫాస్ట్ ఏర్పాటు చేశారు.


మెరిసిపోతున్న మొక్కలు

చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి 100కుపైగా ఎక్స్‌ప్రెస్ బస్సులు

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 11 : రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బుధవారం ప్రమాణస్వీకారం చేయనున్నారు.ఈ కార్యక్రమానికి హాజరయ్యే జిల్లా ప్రజలు, పార్టీ అభిమానుల కోసం జిల్లా ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులు నడుపుతోంది. ఈ మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి 100కు పైగా ఆర్టీసీ బస్సులు బుధవారం విజయవాడ బయలుదేరి వెళుతున్నాయి. తూర్పుగోదావరి జిల్లా నుంచి 32 బస్సులు కేటాయించగా, డాక్టర్ అంబేద్కర్ కోన సీమ జిల్లా నుంచి 35, కాకినాడ జిల్లా నుంచి సుమారు 35 వరకూ ఎక్స్‌ప్రెస్ బస్సులు కేటాయించినట్లు సమాచారం.సాధారణ ప్రయాణీకులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కేవలం ఎక్స్‌ప్రెస్ సర్వీసులను మాత్రమే కేటాయించడం గమనార్హం.

ఎంసెట్‌లో 'ఉమ్మడి తూర్పు'నకు ర్యాంకుల పంట

- ఇంజనీరింగ్ విభాగంలో బిక్కవోలు విద్యార్థికి 25వ ర్యాంకు, ఏలేశ్వరం విద్యార్థికి 40వ ర్యాంకు, నిడదవోలు విద్యార్థికి 56వ ర్యాంకు
- అగ్రికల్చరల్ విభాగంలో తొండంగికి చెందిన 49వ ర్యాంకు, కడియం విద్యార్థికి 54వ ర్యాంకు, సఖినేటిపల్లి విద్యార్థికి 59వ ర్యాంకు


బి.రఘురామసహాన్ (25వ ర్యాంకు)


పీవీఎస్‌డీ సాయిమోహిత్ (40వ ర్యాంకు)


గజ్జరపు సత్యనారాయణ (56వర్యాంకు)


దేశిన సూర్యచరణ్ (49వ ర్యాంకు)


గ్రంధి సాయిమనోజ్ (54వ ర్యాంకు)


కొప్పినీడి ఫణికుమార్ (59వ ర్యాంకు)

రాజమహేంద్రవరం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎంసెట్‌లో ఉమ్మడి తూర్పుగోదావరికి ర్యాంకుల పంట పండింది. ఇంజనీరింగ్ విభాగంలో కాకినాడ జిల్లాకు సంబంధించి సామర్లకోటకు చెందిన మారిశెట్టి సాయిచరణ్ 22వ ర్యాంకు, కాకినాడ రూరల్‌కు చెందిన గొలపల్లి ఫణీంద్ర 47వ ర్యాంకు, కాకినాడ రూరల్‌కు చెందిన బిక్కిన రోహిత్ చౌదరి 57వర్యాంకు సాధించారు. తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి బిక్కవోలుకు చెందిన భీమిరెడ్డి రఘు రామసహాన్ 25వ ర్యాంకు, ఏలేశ్వరానికి చెందిన ప్రగల్లపాటి వీఎస్‌డీ సాయి మోహిత్ 40వ ర్యాంకు, నిడదవోలుకు చెందిన గజ్జరపు సత్యనారాయణ 56వర్యాంకు సాధించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు సంబంధించి కొత్తపేటకు చెందిన బి.సాయినరెన్ 51వ ర్యాంకు, అమలాపురానికి చెందిన బోజనాపల్లి కల్కి సువరణ్ 100వ ర్యాంకు, అమలాపురానికి చెందిన మెట్ల గౌతమ్ వెంకట మహేష్ 105వర్యాంకు సాధించారు. అగ్రికల్చరల్ విభాగంలో కాకినాడ జిల్లాలో శ్రీనగర్‌కు చెందిన దామిశెట్టి సిద్దార్థ 11వ ర్యాంకు, పిఠాపురానికి చెందిన నిమ్మకాయల శర్వణసత్యరవికిరణ్ 13వర్యాంకు, కాకినాడ వెంకటేశ్వరనగర్‌కు చెందిన యండమూరి నమిత రాణి 31వ ర్యాంకు సాధించారు. తూర్పుగోదావరి జిల్లాలో తొండంగికి చెందిన దేశిన సూర్యచరణ్ 49వర్యాంకు, కడియానికి చెందిన గ్రంధి సాయిమనోజ్ 54వ ర్యాంకు, సఖినేటిపల్లికి చెందిన కొప్పినీడి ఫణికుమార్ 59వ ర్యాంకు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ముమ్మిడివరానికి చెందిన దేశంశెట్టి ప్రభాస్ 41వర్యాంకు, మలికిపురానికి చెందిన పెచ్చెట్టి లిఖిత 65వ ర్యాంకు, రాజోలుకు చెందిన సోడదాసు రేష్మిత 92వ ర్యాంకు సాధించారు.

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

దళిత నాయకుల పాదయాత్ర


పాదయాత్రను ప్రారంభిస్తున్న ద్విసభ్య కమిటీ సభ్యులు

కొవ్వూరు, జూన్ 11: టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా దళిత నాయకులు పాదయాత్ర చేపట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని మొక్కు తీర్చుకోవడానికి కొవ్వూరులోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయం నుంచి కొక్కిరిపాటి వెంకటేష్, కొక్కిరిపాటి శ్రీహరి, వేమగిరి వెంకట్రావు తదితరులు గౌరీపట్నం మేరీమాత ఆలయానికి పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్రను ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి ప్రారంభించారు. సీఎం జగన్ సార్వత్రిక ఎన్నికలను పేదలకు, సంపన్నులకు మధ్య జరుగుతున్న యుద్ధమని మద్యం, ధనంతో ప్రలోభాలకు గురిచేశారని, అయినప్పటికీ ప్రజలంతా చంద్రబాబు వెంటే ఉన్నామని నిరూపించారన్నారు. కార్యక్రమంలో మద్దిపట్ల శివరామకృష్ణ, సూర్యదేవర రంజిత్, వట్టికూటి వెంకటేశ్వరరావు, కె.సాంబయ్య, మరపట్ల కళాధర్, బర్ల శ్రీనివాస్, బేతన నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు క్రీడల్లోను ప్రతిభ కనబరచాలి

అవంతీ ఫీడ్స్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఇంద్రకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఇంద్రకుమార్

కొవ్వూరు, జూన్ 11: చిన్నతనం నుంచి చదువుతో పాటు క్రీడల్లోను ప్రతిభ కనబరిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని అవంతీ ఫీడ్స్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అల్లూరి ఇంద్రకుమార్ అన్నారు. కొవ్వూరులోని ఇన్‌డోర్ మున్సిపల్ స్టేడియంలో కొవ్వూరు, పశ్చిమగోదావరి జిల్లా బాడ్మింటన్ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో అవంతీ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన సమ్మర్ క్యాంపు మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఇంద్రకుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి శిక్షణ పొందిన వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. కొవ్వూరు అసోసియేషన్ తరపున టీషర్ట్ అందించారు. ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకష్ణారావు మాట్లాడుతూ కొవ్వూరులో ఇంద్రకుమార్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కోచ్‌లు మాట్లాడుతూ పిల్లలను సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచి క్రీడలపై ఆసక్తి పెంపొందిస్తే ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో కొవ్వూరు బాడ్మింటన్ అసోసియేషన్ ఎడ్వయిజర్ సూరపనేని చిన్ని, పొట్రు మురళీకృష్ణ, మద్దిపట్ల శివరామకృష్ణ, సూర్యదేవర రంజిత్, పొట్రు శ్రీనివాసరావు, టీవీ ముత్యాలరావు, కోచ్‌లు కెనడి, సతీష్, భద్రం, పాల్గొన్నారు.

మహిళల అక్రమ రవాణాను నిరోధించాలి

కొవ్వూరు, జూన్ 11: మహిళల అక్రమ రవాణాను నిరోధించడం ప్రతిఒక్కరి బాధ్యతని ఐసీడీఎస్ సీడీపీవో డి.మమ్మీ అన్నారు. కొవ్వూరు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం హైదరాబాద్‌కు చెందిన ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళల అక్రమ రవాణాపై అంగన్వాడీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. మమ్మీ మాట్లాడుతూ ఉద్యోగం, సినిమా అవకాశాల ఆశ చూపి మహిళలను విదేశాలకు అమ్ముతున్నారన్నారు. ప్రతిరోజు ఎంతోమంది యువతులు మోసపోతున్నారన్నారు. ప్రజ్వల సంస్థ సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ కె.బలరామకృష్ణ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌లు, కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ట్రాఫికింగ్‌కు గురైతే 1930కు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజ్వల కోఆర్డినేటర్ శ్రావ్య స్మృతి, అసిస్టెంట్ కోఆర్డినేటర్ శివ, సుప్రియ, అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

'అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి'

కొవ్వూరు, జూన్ 11: దేవాలయ భూముల వేలంలో ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టిన అధికారులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర తెలుగురైతు కార్య నిర్వాహక కార్యదర్శి పసలపూడి సుభాష్ చంద్రబోసు ఓ ప్రకటనలో కోరారు. మండలంలోని పెనకనమెట్ట మదనగోపాలస్వామి, ఉమారామలింగేశ్వర స్వామి దేవాలయాలకు చెందిన పదెకరాల సాగుభూమికి దేవాదాయ శాఖాధికారులు వేలం నిర్వహించారని, పాత రైతులు, అగ్రవర్ణాలతో కుమ్మక్కై దళిత వర్గానికి చెందిన చిడిపి గుణశేఖర్‌ను వేలానికి రాకుండా నిర్వహణ చేశారని పేర్కొన్నారు. ఈ సంఘటనపై కమిషనర్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేయగా వేలంలో అందరూ పాల్గొనే అవకాశం కల్పిస్తామన్నారన్నారు. గ్రామంలో ప్రస్తుతం ఎకరా పొలం రూ.60 వేలు కౌలు ఉండగా, అధికారులు కుమ్మక్కై రూ.30 వేలకే వేలం ముగించారన్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి, దళిత రైతును తప్పుదారి పట్టించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టిన అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

రోటరీ క్లబ్ నిడదవోలు అధ్యక్షుడిగా రత్నకుమార్



నిడదవోలు, జూన్ 11: నిడదవోలు రోటరీ క్లబ్‌కు 2024-25 సంవత్సరానికి అధ్యక్షుడిగా కొర్లేపర వెంకట రత్నకుమార్, కార్యదర్శిగా అనంతపల్లి కృష్ణచైతన్య, కోశాధికారిగా కోటిపల్లి నాగవెంకట సత్యనారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ప్రస్తుత అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు తెలిపారు. వచ్చే నెల 7న జరిగే కార్యక్రమంలో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేస్తుందన్నారు.

ఎన్నికల సొమ్ములు ఇవ్వాలి

తహశీల్దార్ కార్యాలయం వద్ద ఫొటోగ్రాఫర్ల నిరసన

గోపాలపురం, జూన్ 11: ఎన్నికల్లో విధుల్లో భాగంగా ఆయా విభాగాల్లో పని చేసిన వీడియో, ఫొటోగ్రాఫర్లకు రావల్సిన మొత్తం సొమ్ములు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు ఫొటోగ్రాఫర్లు మాట్లాడుతూ తమను ఎన్నికల విధుల్లో ఫొటోగ్రఫీ చేయాలంటూ అధికారులే తమను విధుల్లోకి తీసుకున్నారని, ఒక్కొక్కరు సుమారు 59 రోజుల పాటు పని చేశామని, తమకు రావల్సిన సొమ్మును కొద్ది మొత్తంలో మాత్రమే చెల్లించి మిగిలిన సొమ్ము అడిగితే అధికారులు కనీసం స్పందించడం లేదని ఆరోపించారు. దీనిపై జాయింట్ కలెక్టర్, కలెక్టర్లను సంప్రదించామని, వారు స్థానిక తహశీల్దార్లను కలవాలని సూచించినట్టు చెప్పారు. పలుమార్లు తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా అధికారులు స్పందించడం లేదన్నారు. మరోమారు జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ ఆవేదన వెల్లగక్కుతామని ఫొటోగ్రాఫర్లు అన్నారు.

వైసీపీ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

అడ్డుకుని కౌన్సిలింగ్ ఇచ్చిన పోలీసులు


ఆత్మహత్యకు యత్నించిన రాజు కుటుంబం

కొవ్వూరు/చాగల్లు జూన్ 11: చాగల్లు మండలం బ్రాహ్మణగూడెం గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త రాజు కొవ్వూరు గామన్‌బ్రిడ్జి పైనుంచి భార్యాబిడ్డలతో గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ మంగళవారం సోషల్ మీడియాలో ఓ వీడియో హల్‌చల్ చేసింది. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ అభ్య ర్థులు ఓడిపోవడంతో మనస్తాపం చెందాడు. వైసీపీ ఓడిపోవడంలో ఈవీఎం టాంపరింగ్ ఉందని, ఈ విషయంపై జగన్మోహన రెడ్డి, రాష్ట్రపతి ద్రౌపది ము ర్ముకు సమాచారం అందజేయాలని, ఇప్పటికిప్పుడు ఈవీఎంల ద్వారా కాకుండా బ్యాలెట్ ద్వారా ఎన్నికలు జరపాలని డిమాండ్ చేస్తున్నట్టు ఆ వీడియోలో ఉంది. సమాచారం తెలుసుకున్న సీఐ వి.జగదీశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని రాజు కుటుంబాన్ని అదుపులోకి తీసుకుని కౌన్సిలింగ్ ఇచ్చారు. అయితే బ్రాహ్మణగూడేనికి చెందిన టి.రాజు వలస కూలీగా జీవనం సాగిస్తుంటాడు. పేదరికంలో జీవించే అతనికి జగన్‌పై అభిమానం ఉండవచ్చు, కాని ఆత్మహత్య ప్రయత్నం చేయడం నాటకమేనని స్థానికులు అంటున్నారు. విచారణ జరిపితే వాస్తవాలు తెలుస్తాయంటున్నారు.

చివటంలో సాధు అమ్మవారికి పూజలు

ఉండ్రాజవరం, జూన్ 11: మండలంలోని చివటం గ్రామంలో అవదూత సాధు అమ్మవారి 43వ పుణ్య ఆరాధనోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభించారు. పతాక ఆవిష్కరణ, సీతారామస్వామికి అభిషేకాలు, గీతాపారాయణం, శ్రీరామ నామ సంకీర్తన, ఆధ్యాత్మిక ప్రవచనాలు నిర్వహించారు. బుధవారం సీతారామస్వామికి తులసిఅర్చన, లలిత విష్ణు సహస్రనామ, అమ్మవారి చరిత్ర పారాయణం జరుగుతుందని ఆశ్రమ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం నగర సంకీర్తన, అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు విశేష పుష్పార్చన, గీతాపారాయణం, అన్నసమారాధన జరుగుతుందని నిర్వాహకులుచెప్పారు.


విద్యుద్దీపాలంకరణలో రాజమహేంద్రవరం మునిసిపల్ కార్యాలయ పార్కు


కలెక్టర్ క్యాంపు కార్యాలయం


రాజమహేంద్రవరంలోని రుడా కార్యాలయం

కార్యాలయాలకు కొత్త కళ

- నేడు ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం
- ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు విద్యుద్దీపాలంకరణ
- కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారానికి అధికారుల ఏర్పాట్లు
- కల్యాణ మండపాలు, కళావేదికల వద్ద భారీ స్ర్కీన్లు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 11: విభజిత ఆంధ్రప్రదేశ్ 3వ ముఖ్యమంత్రిగా టీడీపీ అధినేత నారా చంద్రబాబు బుధవారం ప్రమాణస్వీకారం చేస్తు న్న సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు విద్యుద్దీపాలంకరణ చేశారు. విజయవాడలోని కేసరపల్లి జరిగే చంద్రబాబు ప్రమాణస్వీకారం కార్యక్ర మం వేడుకగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా రాజమహేంద్రవరంలో నగర పాలక సంస్థ కార్యాలయం, ఆర్ట్సకళాశాల, పుష్కరాలఘాట్ రోడ్డులోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయానికి విద్యుద్దీపాలను అలంకరించి ఫోకస్ లైట్లు అమర్చారు. నూతన ప్రభుత్వానికి ఘనంగా స్వాగతం పలికేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. బుధవారం ఉదయం 11:27 గంటలకు చంద్రబాబు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తారు. అప్పటి నుంచి అన్ని ప్రభుత్వ శాఖలలో నూతన ప్రభుత్వ కార్యకలాపాలు ప్రారంభమవుతాయి. చంద్రబాబు ప్రభుత్వం ఏర్పాటుతో అటు ప్రజలు, ఇటు కూటమి నాయకులు, ఉద్యోగుల్లో ఆనందం వ్యక్తమవుతుంది. చంద్రబాబు ప్రమాణస్వీకారాన్ని ప్రజానీకం తిలకించేందుకు రాజమహేంద్రవరంలో పలు చోట్లు ఎల్‌ఈడీ స్ర్కీన్స్ ఏర్పాటు చేశారు.

కోరుకొండ: సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించేందుకు కోరుకొండ మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాట్లు చేసినట్టు ఎంపీడీవో పేర్కొన్నారు. మండలానికి చెందిన జడ్పీటీసీ, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యులు, అందరు సర్పంచ్‌లు ఈ కార్యక్రమానికి విచ్చేయాలని మండల పరిషత్ నుంచి ఆహ్వానాలు పంపినట్టు చెప్పారు.

కొవ్వూరు/తాళ్లపూడి: కొవ్వూరులోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి మాట్లాడారు. చంద్రబాబుతోపాటు కూటమి ఎమ్మెల్యే విజేతల ప్రమాణ స్వీకారోత్సవం బుదవారం ఉదయం 11:27ని.లకు గన్నవరం మెగా ఐటీ పార్క్‌లో జరుగుతుందన్నారు. కార్యక్రమానికి వీక్షించేందుకు కొవ్వూరులోని యువరాజ్ కల్యాణ మండపంలో, తాళ్లపూడి మండలం బల్లిపాడులోని కాకర్ల కల్యాణ మండపంలో, చాగల్లు కల్యాణ మండపంలో ఎల్‌ఈడీ స్ర్కీన్‌లను ఏర్పాటుచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మద్దిపట్ల శివరామకృష్ణ, సూర్యదేవర రంజిత్, వట్టికూటి వెంకటేశ్వరరావు, బేతిన నారాయణ, బర్ల శ్రీనివాసరావు, కె.సాంబయ్య, గెల్లా సురేష్, నాళం శ్రీనివాసరావు, కేవీకే రంగారావు పాల్గొన్నారు.


రాజమహేంద్రవరంలో అబ్దుల్ కలాం విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన లైటింగ్

పెరవలి: సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమం ప్రత్యక్ష ప్ర సారానికి పెరవలి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాట్లు చేసినట్టు ఎంపీ డీవో హిమామహేశ్వరి తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల ప్రజా ప్రతి నిధులు, ప్రజానీకం, ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి తిలకించాలని కోరారు.

అనపర్తి: ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని ప్రజలంతా తిలకించేందుకు వీలుగా అనపర్తిలోని తేతలి రామిరెడ్డి మంగయ్యమ్మ కళావేదికలో అధికారులు స్ర్కీన్ ఏర్పాటు చేస్తున్నారు. సదరు ఏర్పాట్లను మంగళవారం సాయంత్రం టీడీపీ నాయకులు తమలంపూడి సుధాకరరెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి, మల్లిడి ఆదినారాయణరెడ్డి పరిశీలించి సీఐ శివగణేష్, ఎస్ఐ రామారావులతో చర్చించారు. వీక్షించేందుకు వచ్చే వారి కోసం కుర్చీలు ఏర్పాటు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

ఉత్తరాంధ్ర వాసులకు అనంతపల్లిలో అల్పాహారం

నల్లజర్ల, జూన్ 11: విజయవాడలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్న చంద్రబాబు సభ స్థలానికి వెళుతున్న ఉత్తరాంధ్ర వాసులకు నల్లజర్ల మండలం అనంతపల్లిలో జేఎస్ఆర్ కల్యాణ మండపంలో మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్ ఆధ్వర్యంలో అల్పాహారం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానికులకు సైతం అల్పాహారంతోపాటు అక్కడే ప్రమాణస్వీకారం కార్యక్రమాన్ని వీక్షించేందుకు స్ర్కీన్ ఏర్పాటు చేశారు.

చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి వేలాదిగా వెళుతున్నాం..

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 11: ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో వేలాదిగా పాల్గొంటున్నామని టీడీపీ రాజమహేంద్రవరం ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా, పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబు అన్నారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రాజమహేంద్రవరంలో 72 వేల మెజార్టీతో ఆదిరెడ్డి శ్రీనివాస్ చరిత్ర సృష్టించారన్నారు. నగరంలో సమస్యలను ఆయన పరిష్కరిస్తారన్నారు. రాజమహేంద్రవరం టీడీపీ కార్యాలయం నుంచి బుధవారం తెల్లవారుజామున కార్లు, బస్సుల్లో వెళుతున్నామన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు సూరంపూడి శ్రీహరి, పోలాకి పరమేష్, అడ్డగర్ల ఆనంద్, బంగారు నాగేశ్వరరావు, చింతపల్లి నాని, సలాది ఆనంద్, పిల్లి శ్యామ్, శనపతి సత్తిబాబు, కిలపర్తి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



నన్నయ విశ్వవిద్యాలయం కేంద్ర పరిపాలనా భవనం


కొవ్వూరు సమావేశంలో మాట్లాడుతున్న ద్విసభ్య కమిటీ సభ్యులు



పెరవలి ఎంపీడీవో కార్యాలయం


అనపర్తిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు, పోలీసులు

మిరుమిట్లు గొలుపుతున్న నన్నయ వర్శిటీ

దివాన్‌చెరువు, జూన్ 11: నూతన ప్రభుత్వం బుధవారం కొలువుదీరనున్న సందర్భంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని భవనాలను రంగురంగుల విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. యూనివర్శిటీలోని కేంద్ర పరిపాలనా భవనం, బీఆర్ అంబేడ్కర్ కేంద్ర గ్రంథాలయ భవనం, ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్, ఇంజనీరింగ్ కళాశాల భవనం, ప్రధాన ద్వారం వద్ద విద్యుద్దీపాలంకరణ చేసినట్టు విశ్వవిద్యాలయ వర్గాలు వివరించాయి. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఈ ఏర్పాట్లు చేశారు. దీంతో నన్నయ వర్శిటీ భవనాలు విద్యుత్ వెలుగులతో మిరుమిట్లు గొలుపుతున్నాయి

పచ్చిరొట్ట పెంపకంతో భూసారం పెంపు

- జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎస్.మాధవరావు

నల్లజర్ల/కొవ్వూరు, జూన్ 11: పొలంలో పచ్చిరొట్ట పెంపకం ద్వారా భూసారం పెరుగుదలతోపాటు వేరు వ్యవస్థ బలంగా ఉండి అధిక దిగుబడి వస్తుందని జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎస్.మాధవరావు అన్నారు. మంగళవారం మండలంలోని అనంతపల్లిలో పచ్చిరొట్ట వేసిన వ్యవసాయ క్షేత్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ముందుగా వస్తుందని, రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షపాతం సైతం అధికంగా ఉంటుందన్నారు. పచ్చిరొట్ట పంటలైన జీలుగ, జనుము పంటలు వేసిన రైతులు మురుగు దమ్ము చేసి కనీసం 10 రోజుల వ్యవధి తీసుకుని నాట్లు వేయాలన్నారు. నారుమళ్లు మెరక ప్రారంతంలో వేసుకుని 25 రోజుల తర్వాత 3నుంచి 4బద్ద కట్టిన నారును నాటితే పిలకల శాతం పెరిగి మంచి దిగుబడి రావడానికి అవకాశం ఉందన్నారు. ఇదిలా ఉండగా కొవ్వూరులోని కంఠమణి శ్రీనివాసరావు పొలంలో నారుమడిని మాధవరావు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నారుమడికి 10నుంచి 12 రోజుల వ్యవధిలో దమ్ముచేసి చదును చేయాలి. నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా కాలువలను ఏర్పాటుచేసుకోవాలి. 5 సెంట్ల నారుమడికి 2 కిలోల నత్రజని, ఒక కిలో భాస్వరం, ఒక కిలో పోటాష్ ఎరువులు దుక్కులో వేయాలన్నారు. జింకు లోపం ఉంటే లీటరు నీటికి రెండు గ్రాముల జింకు సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. నారు తీయడానికి 7 రోజుల ముందు సెంటు నారుమడికి 160 గ్రాముల కార్బోఫ్యూరాన్ గుళికలు ఇసుకలో కలిపి పలుచగా నీరుంచి వేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట కొవ్వూరు ఏడీఏ పి.చంద్రశేఖర్, ఏవోలు కమల్‌రాజ్, ఎ.గంగాధర్ ఉన్నారు.


నల్లజర్ల: అనంతపల్లిలో పచ్చిరొట్ట వేసిన పొలాన్ని పరిశీలిస్తున్న మాధవరావు

నెహ్రూకు మంత్రి వర్గంలో చోటు దక్కాలి

తంటికొండ వెంకన్న కొండపైకి మోకాళ్లపై ఎక్కిన అభిమాని


కొండపైకి మోకాళ్లపై ఎక్కుతున్న లక్ష్మీనారాయణ

గోకవరం, జూన్ 11: జగ్గంపేట కూటమి ఎమ్మెల్యే విజేత జ్యోతుల నెహ్రూకు మంత్రి వర్గంలో స్థానం దక్కాలంటూ ఆయన అభిమానులు మొక్కులు చెల్లిస్తున్నారు. మంగళవారం మండలంలోని రంప యర్రంపాలెం గ్రామానికి చెందిన గుడిసె లక్ష్మీనారాయణ తంటికొండ వేంకటేశ్వరస్వామి కొండ పైకి మెట్ల మార్గం ద్వారా మోకాళ్లపై ఎక్కి మొక్కు తీర్చుకున్నాడు. అనంతరం స్వామి వారిని దర్శించుకొని 108 కొబ్బరి కాయలను కొట్టి ఎమ్మెల్యే విజేత నెహ్రూకు మంత్రి పదవి దక్కాలలని స్వామిని వేడుకు న్నాడు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మంగరౌతు రాము, ఉంగరాల రాము, బదిరెడ్డి అచ్చన్నదొర, ఉంగరాల గణేష్, గెడ్డం బాబు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణ ఖైదీలకు ఉపయోగకరం

డీఎల్ఎస్ఏ ఇన్‌చార్జి కార్యదర్శి అనురాధ



రాజమహేంద్రవరం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): జైలులో నైపుణ్య శిక్షణ ఖైదీలు విడుదలైన తర్వాత జీవనోపాధికి ఎంతగానో ఉపయోగపడుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.అనురాధ పేర్కొన్నారు. సెంట్రల్ జైలులోని నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఆమె మంగళవారం సందర్శించారు. అదనంగా మరిన్ని విభాగాల్లో శిక్షణ అవసరమైతే ఆ దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ఖైదీలతో మాట్లాడి కేసు వివరాలు, సమస్యలపై ఆరా తీశారు. ఖైదీలకు అందుబాటులో ఉన్న ఉచిత న్యాయసేవల గురించి వివరించారు. ఎలాంటి న్యాయ సహాయం అవసరమైనా డీఎల్ఎస్ఏకి తెలియజే యాలన్నారు. కార్యక్రమంలో జైలర్ ఆర్.శ్రీనివాసులు, నేషనల్ అకాడమి ఆఫ్ కనస్ట్రక్షన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ


చాగల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

చాగల్లు, జూన్ 11: మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా మండలంలోని ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీలు నిర్వహించారు. చాగల్లు పీహెచ్‌సీ పరిధిలో జరిగిన కార్యక్రమంలో వైద్యాధికారి మనోజ్ మాట్లాడుతూ మలేరియా వ్యాప్తి జరగకుండా దోమల నివారణకు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, మురుగు నీరు నిల్వలేకుండా చూడాలన్నారు. దోమల వల్ల డెంగీ, చికెన్ గున్యా, మలేరియా జ్వరాలు వచ్చే ప్రమాదముందన్నారు. వైద్య సిబ్బంది జమీల, ప్రభావతి పాల్గొన్నారు. బ్రాహ్మణగూడెంలో జరిగిన అవగాహన ర్యాలీలో డాక్టర్ నిషిత, డాక్టర్ దేవి, వి.పద్మ, వైద్యసిబ్బంది రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పెరవలి: కానూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్ర పరిధిలోని కానూరు అగ్రహారంలో ర్యాలీ నిర్వహించి దోమలు వల్ల ప్రజలకు వచ్చే వివిధ రకాల జ్వరాలు గురించి వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది డాక్టర్ హేమరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహాల శుభ్రం


పెరవలిలో ఎన్టీఆర్ విగ్రహాన్ని శుభ్రం చేస్తున్న దృశ్యం

పెరవలి, జూన్ 11: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పలు చోట్ల నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. అయితే ఇటీవల ఎన్నికల కోడ్‌ను తొలగించడంతో ఆయా విగ్రహాల ముసుగులు తొలగించారు. ఈ క్రమంలో ఈ నెల 12న ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేస్తున్న సందర్భంగా పలు గ్రామాల్లోని ఎన్టీఆర్ విగ్రహాలకు శుభ్రం చేసి ముస్తాబు చేస్తున్నారు. పెరవలి సెంటర్‌లోని విగ్రహాన్ని టీడీపీ నాయకుడు బొడ్డు రామాంజనేయులు ఆధ్వర్యంలో శుభ్రం చేశారు.

కారు ఢీకొని మహిళకు గాయాలు

కొవ్వూరు, జూన్ 11: స్కూటీని కారు ఢీకొన్న ఘటనలో ఓ మహిళకు గాయాలైనట్టు హెడ్ కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి తెలిపారు. ఈ నెల 10న చీకట్ల సౌజన్య కొవ్వూరు మండలం ఆరికిరేవుల నుంచి కొవ్వూరుకు స్కూటీపై బయలుదేరింది. దండకుండ ఇసుక ర్యాంపు సమీపంలో ఇన్నోవా కారు వెనుక నుంచి వస్తున్న ఢీకొట్టింది. దీంతో ఆమె తలకు తీవ్ర గాయాలు కావడంతో రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి సమాచారం, సౌజన్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సాంబమూర్తి తెలిపారు.

కేంద్ర మంత్రిగా శ్రీనివాసవర్మ నియామకంపై హర్షం

పెరవలి, జూన్11: కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రిగా నరసాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాసవర్మ పదవీ బాధ్యతలు స్వీకరించడం హర్షనీయమని బీజేపీ జాతీయ కిసాన్ మోర్చ నాయకుడు పెన్మెత్స సుబ్రహ్మణ్య వర్మ, సింహాద్రి సత్యనారాయణ అన్నారు. ఆయన హయాంలో రాష్ట్రం పారిశ్రామికంగా అభివృద్ధి చెంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించేలా కృషి చేయాలని ఈ సందర్భంగా కోరారు. కార్యకర్త స్థాయి అంచెలంచెలుగా ఎదిగి ఢిల్లీ స్థాయి వరకు వెళ్లి ఆయన మంత్రి అయినందుకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రాజమండ్రి ఎంపీగా అధిక మెజార్టీతో గెలిచిన రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరికి కూడా శుభాకాంక్షలు తెలిపారు.

'పిల్లలను పనుల్లో పెడితే జైలుకే'

గోపాలపురం, జూన్ 11: బడిలో ఉండాల్సిన పిల్లలను బడి బయట పనుల్లో పెడితే జరిమానాతో పాటు జైలు శిక్ష పడుతుందని వస్తుందని నిడదవోలు లేబర్ ఆఫీసర్ శాంతిరాజు అన్నారు. గోపాలపురంలో కిరణా దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి బాలకార్మికుతో పని చేయిస్తున్న దుకాణదారులను హెచ్చరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామ న్నారు. కార్యక్రమంలో చైల్డ్‌లేబర్ స్పెషల్ డ్రైవ్ ఎస్ఐ ప్రమీల, జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి క్రాంతిలాల్ తదితరులు పాల్గొన్నారు.

యోగా కోర్సులో ప్రవేశాలకు గడువు పెంపు

దివాన్‌చెరువు, జూన్ 11: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ద్వారా కానవరంలోని శ్రీరాపర్తి రామ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యోగాతో పీజీ డిప్లమో ఇన్ యోగా కోర్సులో ప్రవేశాల దరఖాస్తులకు ఈనెల 30వ తేదీ వరకూ గడువు పొడిగించినట్టు ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు మంగళవారం తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి పీజీ డిప్లమో ఇన్ యోగా కోర్సులో ఒక ఏడాది పార్ట్‌టైమ్ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. దీనికి సంబంధించి గడువును 30వ తేదీ వరకూ పొడిగించామని తెలిపారు. ఆలస్య రుసుముతో జూలై 8వ తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరిస్తారని చెప్పారు. నన్నయ విశ్వవిద్యాలయం దివాన్‌చెరువు క్యాంపస్, కానవరంలోని శ్రీరాపర్తి రామ సంస్థలో 50 సీట్లు చొప్పున కోర్సును అందిస్తున్నామన్నారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన వారు ఈ కోర్సులో చేరేందుకు అర్హులని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు పొడిగించిన తేదీల్లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ వై.స్ర్కీన్ 1	లవ్ మీ
వై.స్ర్కీన్ 2	గంగం గణేశా
దేవిశ్రీ(గాయత్రి)	భజే వాయువేగం
అనన్య	గ్యాంగ్ ఆఫ్ గోదావరి

నిడదవోలు

వీ మ్యాక్స్	గ్యాంగ్ ఆఫ్ గోదావరి
రాధాకృష్ణ	భజే వాయువేగం
శ్రీగణపతి	మనమే

దేవరపల్లి

శ్రీరామ్ సినీ మ్యాక్స్	మనమే
శ్రీరామ్ సినీ మ్యాక్స్	మనమే

నల్లజర్ల

శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్ర్కీన్1	గంగం గణేశా
స్ర్కీన్ 2	---
శ్రీనివాస	---